విశాలాంధ్ర

కృష్ణా, ఎన్టీఆర్
గుంటూరు, పల్నాడు

శనివారం 09 నవంబరు 2024 8 పేజీలు

ఆశాల సమస్య పరిష్కరించకుంటే

మరో ఆందోళన తప్పదు

విశాలాంధ్ర-విజయవాడ: ఆశా కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే మరో ఉద్యమం కొనసాగిస్తామని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటసుబ్బయ్య ప్రకటించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎంటి.కృష్ణ బాబుని ఆశ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ కలిసి సమస్యలు వివరించారు. అలాగే మంగళగిరిలో వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వాకాటి అరుణని కలిసి విన్నవించారు. అనంతరం వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ గత నెల 21వ తేదీన ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ రాష్ట్ర కమిషనర్ కార్యాలయం వద్ద ఆశాల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించామని గుర్తు చేశారు. ఆ ధర్నాలో తమ యూనియన్ ఇచ్చిన వినతి పత్రంపై చర్చలు జరిపేందుకు వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ముఖ్యకార్యదర్శిని, కమిషనర్‌లను కలిసి సమస్యల గురించి మరోసారి విన్నవించినట్లు చెప్పారు. ఏపీ ఆశా వర్కర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పి సుభాషిణి, ఎల్.శాంతి మిగతా 2 లో

ఇళ్ల స్థలాల హామీ సాధనకు

18న సచివాలయాల వద్ద ధర్నా

- స్థలంతో పాటు కట్టుబడికి రూ.5 లక్షలివ్వండి
- విద్యుత్ భారాలు ఉపసంహరించకుంటే ఉద్యమం తప్పదు
- ముందస్తు పెట్టుబడి సాయంపై మీనమేషాలు లెక్కిస్తారా
- రైతన్న కన్నెర్ర చేస్తే ప్రభుత్వాలు కూలిపోతాయ్
- మహిళలు, వలంటీర్ల హామీలు ఏమయ్యాయి..?
- ప్రతిపక్షాలపై విమర్శలు కాదు.. శాంతిభద్రతలపై దృష్టి పెట్టండి
- సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : పట్టణ పేదలకు రెండు సెంట్లు, గ్రామాల్లోని పేదలకు మూడు సెంట్లు స్థలం ఇస్తామంటూ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన వాగ్దానాన్ని చంద్రబాబు ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 18వ తేదిన సీపీఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సచివాలయాల వద్ద ధర్నా కార్యక్రమాలకు పిలుపునిచ్చామని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ తెలిపారు. అదే విధంగా అర్హులతో అర్జీలు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. గుంటూరు మల్లయ్యలింగంభవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది పేదలు తమకు ఇంటి స్థలం వస్తుందన్న ఆశతో ఎదురుచూస్తున్నారని, మిగతా 2 లో

నేటి వలంటీర్ల ఆవేదన సదస్సు

జయప్రదం చేయండి: ఏఐవైఎఫ్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : రాష్ట్ర వ్యాప్తంగా 2.60 లక్షల మంది వలంటీర్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 9న విజయవాడలో నిర్వహించనున్న వలంటీర్ల ఆవేదన సదస్సు జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ వలి పిలుపునిచ్చారు. ఈ సదస్సుకు ఉమ్మడి గుంటూరు జిల్లా వలంటీర్లు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. గుంటూరు మల్లయ్యలింగంభవన్‌లో శుక్రవారం మిగతా 2 లో

తహశీల్దార్ కార్యాలయాన్ని

కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర బ్యూరో -మచిలీపట్నం : పెదపారుపూడి తహశీల్దార్ కార్యాలయంను జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారవేదిక మీ కోసంలో వచ్చిన అర్జీల పరిష్కారం, వాటికిచ్చిన ఎండార్స్‌మెంట్లను పరిశీలించారు. భూసమస్యలకు సంబంధించి, ఇళ్ల స్థలాల పంపిణీకి సంబందించిన ఫైళ్ళు, ఆర్ ఒఆర్ రిజెక్షన్స్, మ్యుటేషన్స్ ఫైళ్లు ర్యాండం మిగతా 2 లో

ఐకానిక్ మోడల్‌లో

శంకర్‌విలాస్ ఓవర్ బ్రిడ్జి: ఎంపీ

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : జిల్లాలో అభివృద్ధి పనులను వేగవంతం చేసేందుకు జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులను సమన్వయం చేసుకుంటూ నిరంతరం సంబంధిత శాఖలతో సమీక్ష నిర్వహిస్తున్నామని కేంద్ర గ్రామీణాభివృది, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. రైల్వే, జాతీయ రహదారులు, అర్ అండ్ బీ ప్రాజెక్టులతో పాటు, గుంటూరు మిగతా 2 లో

విద్యుత్ ట్రూ అప్ చార్జీల భారాన్ని

ప్రభుత్వమే భరించాలి

సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి కోటేశ్వరరావు

విశాలాంధ్ర-విజయవాడ: విద్యుత్ ట్రూ అప్ చార్జీల భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వర రావు డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో సింగ్ నగర్ కృష్ణ హొటల్ సమీపంలోని విద్యుత్ ఉప కేంద్రం వద్ద పెంచిన విద్యుత్ చార్జీలను నిరసిస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ బ్యాంకు షరతులకు తలొగ్గి గత వైసీపీ ప్రభుత్వం చేసుకున్న విషమ షరతులు వలన ప్రజలపై గతంలో వాడుకున్న విద్యుత్ మీద ట్రూ అప్ చార్జీల పేరుతో నేటికీ భారం పడుతుందన్నారు. నేడు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) ప్రతిపాదించిన 17 వేల కోట్ల రూపాయల భారం ప్రజల మీద పడకుండా ఆ మొత్తాలను రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ఐదు సంవత్సరాల కాలంలో 9 సార్లు విద్యుత్ చార్జీలు పెంచుతూ సుమారు 35 వేల కోట్ల రూపాయల భారం ప్రజలపై వేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదు నెలల కాలంలో ఇంత భారం మోపటం సరైనది కాదన్నారు. సీపీఐ నగర సహాయ కార్యదర్శి నక్క వీరభద్ర రావు, కార్యదర్శి వర్గ సభ్యులు మిగతా 2 లో

ముఠా కార్మికులకు

కూలీరేట్లు పెంచండి

- నగర ముఠా కార్మిక సంఘం నేతల డిమాండ్
- దాల్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు నోటీస్ అందజేత

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : గత ఏడు సంవత్సరాల నుంచి ముఠా కార్మికులకు కూలీరేట్లు పెంపుదల చేయకుండా వాయిదాలు వేస్తూ తాత్సారం చేశారని, అగ్రిమెంట్ ప్రకారం తక్షణమే వారికి కూలీరేట్లు పెంపుదల చేయాలని నగర ముఠా కార్మిక సంఘం(ఏఐటీయూసీ) జిల్లా అధ్యక్షులు జి.సురేష్ బాబు, ప్రధాన కార్యదర్శి చల్లా చిన ఆంజనేయులు, కోశాధికారి రావుల అంజిబాబు డిమాండ్ చేశారు. ముఠా కార్మికులకు కూలీరేట్లు పెంపుదల చేయాలని కోరుతూ ది గుంటూరు డాల్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు యూనియన్ నాయకులు శుక్రవారం నోటీస్ అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ డాల్ మిల్లులలో పనిచేస్తున్న ముఠా కార్మికుల కూలీరేట్ల అగ్రిమెంట్ కాలపరిమితి 2020 మే 23తో ముగిసిందని, కానీ నేటికి కూలీ రేట్లు పెంపుదల చేయకపోవడం శోచనీయమని అన్నారు. ప్రపంచాన్ని మిగతా 2 లో

మొదటి పేజీ తరువాయి

18నసచివాలయాల వద్ద ధర్నా

కానీ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఐదు నెలలు గడిచిన ఇళ్ల స్థలాల హామీ అంశాన్ని ప్రస్తావించకపోవడం శోచనీయమని అన్నారు. వీరందరి కోసం సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేపడుతున్నామన్నారు. ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో పార్టీ శ్రేణులతో పాటు పేదలు పెద్దసంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. పేదవాడి నోటి దగ్గర ఉండాల్సిన బియ్యం పెద్దల గొడౌన్లలో పెద్దమొత్తంలో ఉంటుందనే విషయం ఇటీవల పట్టుబడిన రేషన్ బియ్యం చెబుతున్నాయని అన్నారు. దీనిపై మరింత సమగ్ర విచారణ జరిపించాలని, మాటల్లో కాకుండా చేతల్లో చూపాలని పౌర సరఫరాల శాఖ మంత్రిని కోరారు. ప్రజలపై విద్యుత్ భారాలు మోపమని అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం సర్దుబాటు చార్జీల పేరుతో విధిస్తున్న చార్జీలు భారాలు కాదా అని ప్రశ్నించారు. అన్ని రకాలుగా సుమారు రూ.18 వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపబోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ చార్జీల భారాన్ని ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని లేనిపక్షంలో బషీర్‌బాగ్ ఘటనను గుర్తుచేసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ముందస్తు పెట్టుబడి సాయంగా రైతాంగానికి రూ.20 వేలు ఇస్తామన్న హామీని సైతం ప్రభుత్వం విస్మరించిందన్నారు. తుఫానులు, వరదల కారణంగా లక్షల ఎకరాలలో పంట నష్టపోయిన రైతు ఆందోళనలో ఉన్నా కూడా సాయమందించడానికి ప్రభుత్వం మీనమేషాలు లెక్కించిందని మండిపడ్డారు. రైతు కన్నెర్ర చేస్తే ప్రభుత్వం కూలిపోతాయన్న విషయాన్ని గుర్తెరగాలన్నారు. ప్రతి మహిళకు నెలకు రూ.1500 సాయం, వలంటీర్లకు రూ.10 వేలు వేతనం ఇస్తామన్న హామీ నేటికి అమలు జరుగలేదన్నారు. ప్రభుత్వ తీరు ఏరు దాటాక తెప్ప తగలేసిన చందంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రోజుకొకచోట మహిళలపై అఘాయిత్యాలు చోటుచేసుకుంటూనే ఉన్నాయని, వీటిపై రాష్ట్ర హోంమంత్రి ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రతిపక్షాలపై రాజకీయ విమర్శలు పక్కనపెట్టి రాష్ట్రంలో శాంతిభద్రతలు, మహిళలపై దాడులు అరికట్టడానికి పగడ్బందీ చర్యలు చేపట్టాలని కోరారు. భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుప్పాల సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇసుక పాలసీ సక్రమంగా అమలు జరపాలని, భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని తదితర డిమాండ్లపై ఈ నెల 11న కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో జిల్లాలోని భవన నిర్మాణ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జంగాల చైతన్య, షేక్ వలి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యశ్వంత్, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి రెంటాల కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆశాల సమస్య పరిష్కరించుకుంటే ఆందోళన తప్పదు

మాట్లాడారు. గత నెల 21వ తేదీన ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ ఇచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు తక్షణం చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అలాగే ఆశాలకు సంబంధంలేని రక్త పరీక్ష చేయించకూడదని ఉత్తర్వులు జారీ చేస్తామని రికార్డులు తక్షణం సరఫరా చేస్తామని వేతనాల పెంపుకు బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వం దృష్టికి తీసుకు పోతామని ఉద్యోగ భద్రతకు, సెలవులకు ప్రసూతి సెలవులకు ఇతర డిమాండ్ల పరిష్కారానికి సంబంధించిన నిర్ణయాన్ని త్వరలో క్రింది స్థాయి అధికారులకు తెలియజేస్తామని వారు సానుకూలంగా స్పందించారని వివరించారు.

నేటి వలంటీర్ల సదస్సు జయప్రదం చేయండి

ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఎన్నికల హామీ నిలబెట్టుకుని వలంటీర్లకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. అధికారం చేపట్టి నాలుగు నెలలు గడిచినా... 8 క్యాబినెట్ సమావేశాలు జరిగినా వలంటీర్ల గురించి ఆలోచన చేయకపోవడం, చర్చించకపోవడం శోచనీయమని అన్నారు. జిల్లా అధ్యక్షులు జంగాల చైతన్య మాట్లాడుతూ ఎన్నికల హామీ ప్రకారం రూ.10 వేలు గౌరవ వేతనం ఇవ్వాలని, రాజకీయఒత్తిడులకు రాజీనామా చేసిన వలంటీర్లను కొనసాగించాలని, బకాయిపడ్డ ఐదు నెలల గౌరవ వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు.రాజకీయ పార్టీల ముసుగులో కాకుండా ఎవరు అధికారంలో ఉన్న ప్రజలకు సేవ చేయడాన్ని బాధ్యతగా నిర్వహిస్తున్న వలంటీర్లకు రాజకీయ రంగు పులమకుండా సీఎం చంద్రబాబు నాయుడు తక్షణం బకాయి గౌరవ వేతనాలు ఇవ్వాలన్నారు. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకోవాలని కోరారు. 9న విజయవాడలో జరిగే వలంటీర్ల ఆవేదన సదస్సులో మాజీ శాసనసభ్యులు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు, న్యాయవాదులు పాల్గొని వలంటీర్లకు మద్దతు తెలియజేస్తారని వెల్లడించారు. వలంటీర్ల సమస్య పరిష్కారం కోసం భవిష్యత్ కార్యాచరణ సదస్సులో రూపొందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యస్వంత్, నగర అధ్యక్ష, కార్యదర్శులు సాయి, ప్రణీత్, ఏఐవైఎఫ్ నగర నాయకులు రెహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.

ఐకానిక్ మోడల్‌లో శంకర్‌విలాస్ ఓవర్ బ్రిడ్జి

నగరపాలక సంస్థలో పారిశుధ్యం, అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. గుంటూరు నగరంలో శంకర్ విలాస్ వద్ద విస్తరించి నిర్మించనున్న రైల్ ఓవర్ బ్రిడ్జ్ పనుల మెుసాయిదా డీపీఆర్ పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను కేంద్ర సహాయ మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంటూరు నగరానికి హార్ట్ వంటి శంకర్ విలాస్ ఓవర్ బ్రిడ్జ్‌ను ఐకానిక్ మోడల్‌లో అత్యాధునిక డిజైన్లతో నిర్మాణం ఉండే ప్రణాళికలు రూపొందించాలన్నారు. డీపీఆర్‌లు సిద్ధం చేసిన వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించేలా ఆర్ అండ్ బీ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నిర్మాణ పనులు నిర్దేశించిన సమయానికే పూర్తి అయ్యేలా, పనులు ఆలస్యమయితే పెనాల్టీలు విధించేలా టెండరు నిబంధనలు రూపొందించాలని ఆర్ అండ్ బీ అధికారులకు సూచించారు. నిర్మాణ సమయంలో నగర ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ డైవర్షన్‌కు సంబంధించి నగరపాలక సంస్థ, ట్రాఫిక్ పోలీసులు ప్రణాళికలు రూపొందించాలన్నారు. అదేవిధంగా శ్యామలనగర్ రైల్వే గేటు వద్ద నాలుగులైన్ల ఆర్వోబీ నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదనలు రైల్వే శాఖకు అందించాలని రైల్వే అధికారులకు సూచించారు. మంగళగిరి నిడమర్రు వద్ద, ఇన్నర్ రింగ్ రోడ్డు ఆటోనగర్ వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జ్ పనులు ప్రారంభానికి చర్యలు తీసుకోవాలన్నారు. నందివెలుగు రోడ్డులో పెండింగ్‌లో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జ్ పనులకు రాష్ట్ర ప్రభుత్వ వినతి మేరకు అవసరమైన నిధులు ఆర్ అండ్ బీకి అందించేలా రైల్వే అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కొప్పురావూరు, బండారుపల్లి, కంతేరు, కొప్పురావూరు వద్ద ఉన్న ఆర్ యు బీల వద్ద వర్షం నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రాజధాని నుంచి వినుకొండ వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారి నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను పూర్తి అయ్యి పనులు ప్రారంభించేలా రెవెన్యూ, జాతీయ రహదారుల శాఖ అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలన్నారు. పెదకాకాని వద్ద జాతీయ రహదారి అప్రోచ్ పనులు ప్రారంభానికి చర్యలు తీసుకోవాలన్నారు. నగరపాలక సంస్థలో పారిశుద్ధ్యం పనుల సమీక్షలో కేంద్ర సహాయ మంత్రి మాట్లాడుతూ పారిశుధ్యంలో మార్పు రావాలని, అందుకు తగిన విధంగా జీఎంసీ కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని తెలిపారు. రాబోవు వారం రోజుల్లో గుంటూరు పశ్చిమ, తూర్పు ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో జీటీఎస్‌ల ఏర్పాటుపై స్థల నిర్ధారణ చేసి, కమిషనర్‌తో సమన్వయం చేసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి మాట్లాడుతూ శంకర్ విలాస్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణానికి ప్రజాప్రతినిధుల సూచనలను పరిగణలోకి తీసుకొని తుది డీపీఆర్ రూపొందించాలన్నారు. జాతీయ రహదారులు, ఆర్వోబీలకు అవసరమైన భూ సేకరణ ప్రక్రియకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు కేఎస్ లక్ష్మణరావు, చంద్రగిరి ఏసురత్నం, జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, గళ్లా మాధవి, మహమ్మద్ నసీర్ అహ్మద్, అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైనీ) పవార్ స్వప్నిల్ జగన్నాథ్, డీఆర్వో ఖాజావలి, జాతీయ రహదారుల పీడీ పార్వతీశం, రైల్వే డిప్యూటీ చీఫ్ ఇంజనీరు నోయల్, ఆర్ అండ్ బీ ఎస్ఈ శ్రీనివాసమూర్తి, గుంటూరు రెవెన్యూ డివిజన్ అధికారి శ్రీనివాసులు, అడిషన్ కమిషనర్ సీహెచ్ ఓబులేష్, సీపీ రాంబాబు, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సీఎంఓహెచ్ శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రూ అప్ చార్జీల భారాన్ని ప్రభుత్వమే భరించాలి

బుట్టి రాయప్ప, పంచదార్ల దుర్గాంబ, తాడి పైడియ్యలు మాట్లాడుతూ వినియోగదారుడు వాడుకున్న విద్యుత్ చార్జీలకు, అదనపు చార్జీలకు పొంతన లేకుండా ఉందన్నారు. వినియోగించిన విద్యుత్ కంటే అదనపు చార్జీల భారం మరింత ఎక్కువగా ఉందన్నారు. ప్రజలకు అర్థంకాని రీతిలో వివిధ రూపాలలో భారం వేసి దోచుకోవటం సరికాదన్నారు. సీపీఐ నగర కార్యదర్శివర్గ సభ్యులు కేవీ భాస్కరరావు ఆధ్వర్యంలో ప్రజలపై పడుతున్న కరెంటు చార్జీలు, ఇతర నిత్యావసర వస్తువుల భారాలతో సతమతమవుతున్న ప్రజల ఇబ్బందులను తెలియజేస్తూ వేసిన లఘు నాటిక స్థానికులను ఆకర్షించింది. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు ఒర్సు భారతి, దోనేపూడి సూరిబాబు,సింగ రాజు సాంబ శివ రావు, లింగాబత్తుల శివ కుమార్, తిప్పాబత్తుల వెంకటేశ్వరరావు, దుగ్గిరాల సీతారావమ్మ, మహిళా సమాఖ్య నాయకులు తమ్మిన దుర్గ,డి. పుష్పావతి, ఏఐవైఎఫ్ నగర అధ్యక్ష కార్యదర్శులు లంకా గోవిందరాజు,కంచర్ల భార్గవ్ స్థానిక నాయకులు ఎస్‌కే.భాషా, సింహాచలం, పి.నాగరాజు, శాయి, నాగూర్ బీ, కన్నమ్మ, నిర్మల, శంకరమ్మ, మబ్బుల సన్నీ,ప్రజా నాట్య మండలి నాయకులు మల్లి పట్నాయక్, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ముఠా కార్మికులకు కూలీరేట్లు పెంచండి

అతలాకుతలం చేసిన కరోన మొదటి దశ, రెండవ దశ, మూడవ దశ సమయంలోనూ ముఠా కార్మికులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పనులు నిర్వహించిన విషయాన్ని ఈ సందర్భంగా వారు గుర్తుచేశారు. అయితే గత రెండు దఫాలుగా కూలీ రేట్ల పెంపుదల అగ్రిమెంట్ కరోన, ఇతర కారణాలతో వాయిదా వేశారన్నారు. ప్రస్తుతం ముఠా కార్మికులు అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. నిత్య జీవిత అవసర వస్తువుల ధరలు రోజురోజుకు పెరుగుతుండటంతో ముఠా కార్మికుల జీవనం దుర్భరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని తమ వద్ద పనిచేస్తున్న ముఠా కార్మికుల కూలీ రేట్లు పెంపుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేస్త్రీలు దోర్నాల సోమిరెడ్డి, కోటయ్య, దుర్గ, మలమందరెడ్డి, శివారెడ్డి, సుబ్బారావు, హనుమాన్ తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ తనిఖీ

తనిఖీ చేశారు. ఫైళ్ల నిర్వహణ సరిగా లేదని అసంతృప్తి వ్యక్తం చేసి, తహసీల్దార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్జీల పరిష్కారం పెండింగ్ లేకుండా ఎప్పటికపుడు పరిష్కరిస్తూ సరైన ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని, ఆవిషయం అర్జీదారులకు తెలియజేయాలని తహసీల్దార్ రంగారావుకు సూచించారు. పెదపారుపూడిలోని జిల్లా పరిషత్ హైస్కూల్ సందర్శించి, మధ్యాహ్న భోజన అమలును తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం రుచి చూచి విద్యార్థులతో ముచ్చటించారు. మధ్యాహ్న భోజనం రుచిగా, శుచిగా విద్యార్థులకు అందించాలని ఎంఈఓ సురేష్‌కు పాఠశాల హెచ్ఎం ఎం. భవానికి సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ డీకే. బాలాజీ పెదపారుపూడి పిహెచ్‌సిని సందర్శించి, రోగులకు అందిస్తున్న వైద్య సేవల గురించి ఆరా తీసారు. ఆసుపత్రిలో ప్రసవాలు గురించిన రికార్డులను, టిబి రోగులకు అందిస్తున్న వైద్య సేవలు వాటి రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న మందులు గురించి ఆరా తీశారు. గుడివాడ ఆర్డీఓ బాలసుబ్రహ్మణ్యం, పెదపారుపూడి ఎంపిడిఓ సీతా మహాలక్ష్మీ పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సౌర విద్యుత్ కల్పించాలి: ఎంపీ

విశాలాంధ్ర-నరసరావుపేట: ప్రతీ ఇంట్లో సౌర విద్యుత్ వినియోగించుకొనే విధంగా వినియోగదారులను చైతన్యపరచాలని ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు అన్నారు. దీని కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం సూర్యఘర్ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ పథకం అమలుపై కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ సూరజ్‌తో కలిసి సంబంధిత శాఖలతో శుక్రవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. మండలాల వారీగా పథకం అమలును సమీక్షించారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ మాట్లా

డుతూ ఈ పథకంపై విస్తృత ప్రచారాన్ని నిర్వహించాలని ఆదేశించారు. గృహ నిర్మాణ, టిడ్కో పంచాయితీరాజ్, మున్సిపాలిటీలు సమన్వయంతో పనిచేసి పథకాన్ని అందరికీ వర్తింపజేయాలని సూచించారు. ముఖ్యంగా గృహ నిర్మాణ, టిడ్కో అధికారులు పథక లబ్ధిదారులకు అవగాహన కల్పించి, తమ ఇళ్లకు సౌర విద్యుత్ ఏర్పాటు చేసుకొనేలా చూడాలని జెసి ఆదేశించారు. ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ పట్టణ ప్రాంతాలపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించాలని, వినియోగదారులను చైతన్యపరచాలని చెప్పారు. నాణ్యమైన ఫలకాలను వినియోగించేలా, నిర్వహణా లోపాలు లేకుండా సేవలను అందించేలా, లబ్ధిదారులకు సబ్సిడీ వీలైనంత వేగంగా అందేలా చర్యలు తీసుకోవాలని, ఈ మేరకు కాంట్రాక్టర్లు లేఖ రాయాలని సూచించారు. ఈ సమావేశంలో ఏపిఈపిడిసిఎల్ ఎస్ఈ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కళాశాలలో సైబర్ సెక్యూరిటీపై ఉపన్యాసం

విశాలాంధ్ర-మంగళగిరి : ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలోని ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో శుక్రవారం సైబర్ సెక్యూరిటీ పై ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ ఉపన్యాస కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ మేనేజర్, సెక్యూరిటీ కన్సల్టెంట్ వెంకటేశ్వర రెడ్డి పాల్గొన్నారు. ప్రస్తుత రోజుల్లో సైబర్ సెక్యూరిటీ ఎంతో కీలకమని, సైబర్ దాడులపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలన్నారు. అనంతరం ఉపకులపతి ఆచార్య కె.గంగాధర రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీనివాస వెంకటేశ్వర రెడ్డిని ఆయన అభినందించి సత్కరించారు. ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సిద్దయ్య, అసిస్టెంట్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.గోపికృష్ణ, డాక్టర్ డి. చంద్రమౌళి, సైబర్ సెక్యూరిటీ విభాగాధిపతులు డాక్టర్ బాలాజీ, డాక్టర్ సతీష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాల బాలికల తైక్వాండో ఎలక్షన్స్

విశాలాంధ్ర-మంగళగిరి : చింతకింది కనకయ్య హై స్కూల్ నందు జిల్లా స్థాయి సబ్ జూనియర్ బాల బాలికల తైక్వాండో సెలక్షన్స్ ఆదివారం జరుగుతాయని గుంటూరు జిల్లా తైక్వాండో జనరల్ సెక్రటరీ పి.సుబ్బారావు శుక్రవారం తెలియజేశారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి గుంటూరు జిల్లాలోని తైక్వాండో క్రీడాకారులందరూ వినియోగించుకోవాలని తెలియజేశారు.ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు ఈ నెల 15, 16, 17వ తేదీలలో కందుకూరులో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని ఆయన తెలిపారు.

లోవోల్టేజ్ సమస్య పరిష్కారం

విశాలాంధ్ర-దాచేపల్లి : నగర పంచాయతీ కార్యాలయం సమీప ప్రాంతాల్లో ఏళ్ల తరబడి నెలకొన్న లోవోల్టేజీ సమస్యకు శుక్రవారం నుంచి చరమగీతం పలికింది. స్థానిక విద్యుత్ వినియోగదారుల వినతి మేరకు ఎట్టకేలకు అధికారులు స్పందించారు. 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను కార్యాలయం వద్ద బిగించి విద్యుత్ కనెక్షన్ ఇచ్చారు. ఈ పనిలో ఏఈ భగవాన్, ఎల్ఐలు వెంకట్రావు, రామిరెడ్డి, లైన్‌మెన్ గాండ్ల గణేష్, ఏఎల్ఎం నరేష్, జేఎల్ఎంలు రాజశేఖరరెడ్డి, శివ నాగేంద్రం తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులను పరిష్కరించాలి

విశాలాంధ్ర-శావల్యాపురం: దరఖాస్తులను గడువు లోపల పరిష్కరించాలని ఆర్డీవో కురుభ మధులత అన్నారు. మండలంలోని పోట్లూరు రెవిన్యూ పరిధిలో నూతనంగా నిర్మించనున్న పెట్రోల్ పంపు స్థలాన్ని, స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీఓ మధులత శుక్రవారం సందర్శించారు. అనంతరం కార్యాలయాన్ని కలియ తిరుగుతూ సిబ్బందితో మాట్లాడి, పలు రికార్డులను పరిశీలించి తగు సూచనలు చేశారు. తహశీల్దార్ సుజాత, డిప్యూటీ తహశీల్దార్ వెంకట నాగరాజు, రిసర్వే డిటి నాసరయ్య సిబ్బంది ఉన్నారు.

10 నుంచి జీ తెలుగు సింగింగ్ షో సరిగమప సీజన్ 16

విశాలాంధ్ర/గుంటూరు : తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న మ్యూజికల్ రియాలిటీ షో సరిగమప సీజన్ 16 నవంబర్ 10 నుండి ప్రతి ఆదివారం రాత్రి 8:30 గంటల నుంచి 10 గంటల వరకు జీ తెలుగులో ప్రసారం కానుందని సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎనర్జిటిక్ యాంకర్ శ్రీముఖి వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న ఈ సీజన్కి సంగీత దిగ్గజాలు కోటి, ఎస్పీ శైలజ, కాసర్ల శ్యామ్తో ఈ సీజన్ ఉత్తేజకరమైన ప్రదర్శనలు, మనసును హత్తుకునే పాటలతో సంగీత ప్రియులకు మరింత వినోదం పంచబోతోందన్నారు. ప్రతి కంటెస్టెంట్ తమ ఆకట్టుకునే ప్రదర్శనలతో తెలుగు ప్రేక్షకులకు ఫేవరెట్గా మారుతున్నారన్నారు. ఔత్సాహిక గాయకులు తదుపరి సింగింగ్ సెన్సేషన్ టైటిల్ కోసం పోటీ పడుతుండటంతో థ్రిల్లింగ్ కాంపిటీషన్లు, మరచిపోలేని క్షణాలను అందిస్తూ ప్రతి వీకెండ్ను మరింత స్పెషల్ చేస్తోందన్నారు. ఆదివారం అంతులేని వినోదం అందించే ఉద్దేశంతో జీ తెలుగు సరిగమప సీజన్ 16 ప్రసార సమయాన్ని మరింత పెంచిందన్నారు. శ్రోతల మనసును తాకే సంగీతంతోపాటు చక్కని వినోదం అందించే లక్ష్యంతో వస్తున్న జీ తెలుగు సరిగమప సీజన్ 16 ప్రతి ఆదివారం తప్పక చూడలన్నారు.

టీడీపీ పాలనలోనే దళితులకు సముచిత గౌరవం: జీవీ

విశాలాంధ్ర - వినుకొండ : ప్రస్తుతమేకాక ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ దళితులకు సముచిత గౌరవం, అవకాశాలు ఇచ్చిన ఏకైక పార్టీ తెలుగుదేశం మాత్రమే అని వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. అవకాశాలతో పాటు దళిత, బహుజన ఉద్యమాలకు కొండంత అండగా పార్టీ నిలిచిందన్నారు. వినుకొండ తెలుగుదేశం పార్టీ నాయకుల ఆహ్వానం మేరకు శుక్రవారం పట్టణానికి వచ్చిన లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావును తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి ఘనంగా సన్మానించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై నాయకులకు ఎమ్మెల్యే జీవీ, పిల్లి మాణిక్యరావు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే జీవీ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక సభ్యుడిగా అనేక పోరాటాలు, ఉద్యమాలతో జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న వ్యక్తి మాణిక్యరావు అని కొనియాడారు. ఎమ్మార్పీఎస్‌లో వివిధ హోదాల్లో పనిచేశాక తెలుగుదేశం సిద్ధాంతాలు, ఆశయాలు నచ్చి చంద్రబాబు నాయకత్వంలో పనిచేయాలనే ఉద్దేశంతో పార్టీలో చేరారన్నారు. లెదర్ ఇండస్ట్రీస్‌ను భవిష్యత్తులో ఉన్నత స్థితికి తీసుకెళ్తారని, సీఎం చంద్రబాబుతో మాట్లాడే చొరవ ఉన్న వ్యక్తిగా, నిధులు తీసుకొచ్చి తప్పనిసరిగా వేలమందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తారనే ఆశాభావం వ్యక్తం చేశారు. అవసరమైతే వినుకొండలో లెదర్ పార్కు ఏర్పాటుకు భూములు ఇవ్వడానికి తాము సిద్ధంగా ఉన్నామని జీవీ అన్నారు. అనంతరం లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు జీవీ ఆంజనేయులు, ఆలపాటి రాజా, ధూళిపాళ్ల నరేంద్రతో పాటు ఉమ్మడి గుంటూరు జిల్లా తెదేపా నేతలంతా తనను ప్రేమ, గౌరవంతో ముందుకు నడిపించారన్నారు. ఎమ్మెల్యే సీటు ఇవ్వలేకపోయినందుకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ తనకు లిడ్ క్యాప్ ఛైర్మన్‌గా అవకాశం కల్పించారని, అందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు. అయిదేళ్ల వైకాపా పాలనలో లిడ్ క్యాప్ మూలనపడిపోయి ఉందని, ఆస్తులను అన్యాక్రాంతం చేశారని, వాటిని మళ్లీ ఏవిధంగా వెనక్కి తీసుకురావాలి, పరిశ్రమలు తీసుకురావడానికి ఎవరితో మాట్లాడాలో అధ్యయనం చేశామన్నారు. విజయవాడలో పెద్ద లెదర్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో పార్టీని సమర్థంగా నడిపించిన శక్తి సామర్థ్యాలు జీవీ ఆంజనేయులుకు ఉన్నాయని, ప్రతి నియోజకవర్గంలో జరిగే కార్యక్రమాల గురించి చంద్రబాబుతో మాట్లాడేవారన్నారు. జిల్లాలో తనలాంటి ఎంతోమంది నాయకుల్ని ఆయన తయారు చేశారన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ నేతలు ఓటమి భయంతోనే బహిష్కరిస్తున్నట్లుగా నాటకం ఆడుతూ వేరేవాళ్లను ప్రోత్సహించే పద్ధతి చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు పఠాన్ అయూబ్ ఖాన్, రాష్ట్ర టిడిపి కార్యదర్శి షమీంఖాన్, టిడిపి నాయకులు పి.వి.సురేష్ బాబు, సౌదాగర్ జానీ బాషా, గట్టుపల్లి శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

సీపీఐ నాయకులు మోటుపల్లి యోగేశ్వరరావు మృతి

ప్రముఖుల నివాళి

విశాలాంధ్ర - వినుకొండ : కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతు గురువారం రాత్రి సీపీఐ నాయకులు మోటుపల్లి యోగేశ్వరరావు(68) మృతిచెందారు. అకాల మరణానికి చింతిస్తూ ఆ పార్టీ వినుకొండ నియోజకవర్గ కమిటీ వారు ఆయన భౌతిక కాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్ మాట్లాడుతూ అజాతశత్రువు అందరికీ మిత్రుడు మృదుస్వభావి అమరుడైన కామ్రేడ్ యోగేశ్వరరావు అన్నారు. తన తండ్రి కమ్యూనిస్టు అయినందున ఆయన ఆశయాలను ఆచరిస్తూ తన కుటుంబం భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె అందరికీ పెళ్లిళ్లు చేసి కుటుంబ పరిస్థితులు చక్కదిద్దుకొంటూ వినుకొండ నియోజకవర్గంలో సీపీఐ నాయకుడిగా, ప్రజా సేవకుడిగా ప్రజల మన్ననలు పొందిన వ్యక్తిగా కామ్రేడ్ యోగేశ్వరరావు మంచి పేరు ప్రఖ్యాతులు పొందారని తెలియజేశారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని సంతాపాన్ని తెలియజేస్తున్నట్లు తెలిపారు. నివాళులర్పించిన వారిలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, రైతు సంఘం జిల్లా నాయకులు ఉలవలపూడి రాము, సీపీఐ నాయకులు పొట్లూరు వెంకటేశ్వర్లు, కె.మల్లికార్జున రావు, చీరాల ఆంజనేయులు, చైతన్య తదితర సంఘాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. అంతిమ సంస్కారాన్ని శుక్రవారం ఆయన స్వగ్రామం పిట్టంబండలో నిర్వహించారు.

ఆడపిల్లను రక్షిద్దాం.. చదివిద్దాం

విశాలాంధ్ర-దాచేపల్లి : ఆడపిల్లను రక్షించుకుందామని, ఆడపిల్లను చదివించుకుందామని గురజాల సీడీపీఓ షేక్ రుక్సానా బేగం పిలుపునిచ్చారు. ఐసీడీఎస్ గురజాల ప్రాజెక్టు ఆధ్వర్యంలో శుక్రవారం నగర పంచాయతీ సహ గ్రామీణ మండలం స్థాయిలో బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సభకు ఆమె అధ్యక్షత వహించి మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. పోక్సో చట్టంపై మరింత అవగాహన కల్పించారు. బాలికలు, మహిళల సమస్యలను వివరిస్తూ వాటిని ఎదుర్కోవడం కోసం ఉన్న చట్టాల గురించి సమగ్రంగా చెప్పారు. భారతీయ న్యాయ సంహితపై మరింత అవగాహన కల్పించారు. దాచేపల్లి, నడి కూడి, కేసానపల్లి సెక్టార్ల పర్యవేక్షకులు శ్రీలక్ష్మీ, అరుణశ్రీ, వర లక్ష్మీ, పీఏఐసీ కృష్ణారెడ్డి మాట్లాడారు. ఎంపీడీవో రామకృష్ణ, జిల్లా ట్రైనర్ మహీధర్ తదితరులు మాట్లాడుతూ ఇంటింటి సర్వే చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, పీహెచ్‌సీ సిబ్బంది, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

నైపుణ్య గణనన సర్వే త్వరితగతిన పూర్తి చేయాలి

విశాలాంధ్ర-నూజెండ్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నైపుణ్య గణనన సర్వేను పారదర్శకంగా త్వరితగతిన పూర్తి చేయాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి పావులూరు ఉమాదేవి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సచివాలయ సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువతకు అవసరమైన నైపుణ్యాల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ఈ సర్వే చేపట్టడం జరుగుతుందని అన్నారు. సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి 15 నుంచి 59 ఏళ్ల మధ్య వయసు ఉన్న ప్రతిఒక్కరినీ సర్వే చేపట్టి డేటా సేకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ ఎస్డీసీ స్కిల్ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్ జానీ భాష, మాస్టర్ ట్రైనర్స్ జి.వెంకట్రావు, హరేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల హక్కులపై అవగాహన కల్పించాలి

విశాలాంధ్ర-రెంటచింతల: బాలికలలో అక్షరాస్యతను పెంపొందించ చడం ద్వారా వారి హక్కులను కాపాడేందుకు ఎంతగానో దోహదపడుతుందని మండల పరిషత్ అభివృద్ధి అధికారిని సరోజినీ దేవి, ఐసిడిఎస్ సూపర్వైజర్లు ఏ నాగమణి, వై శ్రీదేవి లు అన్నారు. శుక్రవారం రెంటచింతల మండల పరిషత్ కార్యాలయంలో బేటి బచావో బేటి పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చట్టాలపై అవగాహన కల్పించడం ద్వారా బాల్య వివాహాలను అరికట్టవచ్చని అన్నారు. క్షేత్రస్థాయి నుండి బాలికల హక్కులు గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం బాలికలకు మహిళలకు రక్షణ కల్పించేందుకు న్యాయ సంహిత చట్టంలో అనేక మార్పులు తీసుకొచ్చిన విషయాన్ని వివరించారు. ఇంటికి వెలుగు ఇల్లాలు అనే విషయాన్ని ప్రకటనలకు మాత్రమే పరిమితం చేయకుండా వారికి అన్ని రంగాల్లో సహాయ సహకారాలు అందించి ఆచరణలో పెట్టాల్సిన బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరి పైన ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు నర్రా కృష్ణారెడ్డి, ప్రదీప్ రెడ్డి, ఈవోపీఆర్డి శ్రీనివాస్ రెడ్డి, మహిళా కార్యదర్శిలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పార్కు ఏర్పాటుకు స్థలం కేటాయించాలి

విశాలాంధ్ర-మాచర్ల: పెరుగుతున్న కాలుష్య నిర్మూలనకు పార్కు, స్వాతంత్ర సమరయోధుల విగ్రహాల ఏర్పాటుకు ప్రభుత్వం స్థలాన్ని కేటాయించాలని శ్రీ వీరబ్రహ్మేంద్ర ప్రజా హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు గురజాల అప్పారావు శుక్రవారం ఆర్డీఓ మురళికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గురజాల అప్పారావు మాట్లాడుతూ జనాభా శాతం పెరిగి అటవీ భూములు తగ్గిపోవడంతో వాతావరణం పొల్యూట్ అయిందన్నారు. ప్రస్తుత సమయంలో మొక్కలను పెంచి కాలుష్య నిర్మూలనకు పాటుపడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గురజాల డివిజన్ పరిధిలోని నడికుడి గ్రామంలో సర్వే నెంబర్ 127/1 లో నిరుపయోగంగా ఉన్న 0.45 సెంట్ల ప్రభుత్వ భూమిని తమ ట్రస్టుకు కేటాయించాలని, స్వాతంత్ర సమరయోధుల కీర్తిని చాటేలా విగ్రహాలను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన కోరామన్నారు. వినతిపై డివిజనల్ రెవిన్యూ అధికారి పరిశీలిస్తామని చెప్పినట్లు ఆయన తెలిపారు. సైకం కృష్ణారెడ్డి, కొరదల జోతి, కిన్నెర రవి ఉన్నారు.

ప్రతి ఒక్కరికీ పని కల్పించాలి: ఈసీ

విశాలాంధ్ర-దుర్గి: గ్రామాల్లో ఉపాధి పని అడిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించే బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్లపై ఉందని ఇన్చార్జీ ఈసీ రవీంద్ర నాయక్ అన్నారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం 2025-26కు సంబంధించిన ప్రణాళిక, పనులు గుర్తింపుపై ఫీల్డ్ అసిస్టెంట్లకు ఏర్పాటు చేసిన అవగా హన కార్యక్రమంలో ఆయన మాట్ల డారు. గ్రామాల్లో గ్రామ సభలు ఏర్పాటు చేసి ఉపాధి హామీ పథకంలో ఉన్న పనులు గ్రామాల్లో గుర్తించి ముం దుగా ప్రణాళిక తయారు చేసుకొని దాని అనుగుణంగా కూలీలకు పని కల్పించడం సులభంగా ఉంటుంద న్నారు. ఫోన్లో ముందుగా యాప్ లు డౌన్లోడ్ చేసుకుని ఉపాధి హామీ పథకంలో పనులు ఏపీ యాప్ లను ఉపయోగించుకోవాలో అవగాహన కలిగి ఉండాలన్నారు. పనులకు సంబంధించిన వివరాలను వర్క్ ఫైల్ నందు పూర్తి చేసి ఉండాలని సూచించారు. ఉపాధి హామీ పథకంలో ఏఏ పనులు ఉంటాయో ఫీల్డ్ అసిస్టెంట్లను అడిగి తెలుసుకున్నారు. అన్ని రికార్డులు పకడ్బందీగా ఉండాలని చెప్పారు. ఏపీఓ జి.చినవెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లు సమయపాలన, క్రమశిక్షణ కలిగి విధులు నిర్వహించాలని సూచిం చారు. ఈకార్యక్రమంలో క్లస్టర్ టెక్ని కల్ అసిస్టెంట్ భూసాని గోవిందరాజు, బీఎఫ్టీ.కె.శిరీష, సీవో కె.నాగమణి, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

తప్పిదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి: పరమేశ్వరి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గుంటూరు మెడికల్ కళాశాలలోని మైక్రో బయాలజీ విభాగంలో శుక్రవారం ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో పని చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్స్ ఈక్యూఏఎస్, రిఫ్రెషర్ శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ నెల 30వ తేదీన పదవీ విరమణ చేయ నున్న మైక్రో బయాలజీ విభాగం ప్రొఫెసర్ అండ్ హెచ్ఓడీ డాక్టర్ పరమేశ్వరిని శాలువా, బొకేతో ఘనంగా సన్మానించారు. ఆమె మాట్లాడుతూ మాట్లా డుతూ ఐసీటీసీ సెంటర్స్‌లో హెచ్ఐవీ రక్త నమూనాల సేకరణ దగ్గర నుండి టెస్టింగ్.. పేషంట్స్‌కు రిపోర్టులు ఇచ్చే వరకు ఎటువంటి తప్పిదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా క్షయ, లెప్రసీ, ఎయిడ్స్ నియంత్రణ అధికారి శ్రీనివాసులుకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఎల్ ఇన్‌ఛార్జ్ డాక్టర్ శివమ్మ, జిల్లా క్షయ, లెప్రసీ, ఎయిడ్స్ నియంత్రణ అధికారి శ్రీనివాసులు, జిల్లా ఐసీటీసీ సూపర్ వైజర్ వీరాస్వామి, జీజీహెచ్ ఐసీటీసీ కౌన్సిలర్ షేక్.ముస్తాఫా పాల్గొన్నారు.

'సుమేధ'లో ఫ్యాన్సీ డ్రస్ పోటీలు

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: స్థానిక ఎన్జీజీవోస్ కాలనీలోని సుమేధ హై స్కూల్లో బాలోత్సవ్-7 లో భాగంగా శుక్ర వారం ఫ్యాన్సీ డ్రస్ పోటీలు జరిగాయి. ఇందులో భాగంగా చిన్నారులు ఝాన్సీ లక్ష్మీ బాయ్, అల్లూరి సీతారామ రాజు, డాక్టర్ ఛత్రపతి శివాజీ, తెలుగు అమ్మాయి, టీచర్, బుడ బుక్కలవాడు, కేరళ కుట్టి, శివుడు, తెనాలి రామకృష్ణ, సుభాష్ చంద్రబోస్, దేవకన్య, పంతులు, బెంగాలి అమ్మాయి, సైనికుడు, శకుంతలగా వివిధ రకాల జాతీయ వేషధారణలో సందడి చేశారు. ఈ కార్యక్ర మంలో చిన్నారులు వారి వేష దారణకు తగినట్టుగా సంభాషణలతో అలరించారు. స్కూలు డైరెక్టర్ మున్నంగి చంద్ర శేఖర్ రెడ్డి ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లితండ్రులు పాల్గొన్నారు.

డ్రైవర్లకు రహదారి భద్రతపై అవగాహన

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : రోడ్డు భద్రతా నియమాలు పాటించటం వలన ప్రమాదాలు తగ్గిం చవచ్చని గుంటూరు ఉప రవాణా కమిషనర్ కె.సీతారామిరెడ్డి వాహనదారులకు తెలియజేశారు. ఈ మేరకు శుక్రవారం జేకేసీ కాలేజీ రోడ్డులో ఉన్న ఆర్టీఓ కార్యాలయంలో ఆటో యూనియన్ డ్రైవర్లకు, గూడ్స్ క్యారేజ్, మోటార్ క్యాబ్, మ్యాక్సీ క్యాబ్ ఓనర్లకు రహదారి భద్రతపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వాహనం నడుపుతున్న సమయంలో తీసుకోవాల్సిన రహదారి భద్రత, జాగ్రత్తలు గురించి తెలిపారు. తొలుత వారితో రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చదివించి వాటిపై కరపత్రాలను వారికి అందజేశారు. ఈ సదస్సులో గుంటూరు ప్రాంతీయ రవాణాశాఖ అధికారి బి.సత్యనారాయణ ప్రసాద్, ఎంవీఐలు గోపాల్, మల్లీశ్వరి, జె.అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న తాడేపల్లి పోలీసులు

విశాలాంధ్ర-తాడేపల్లి : గత కొద్దిరోజులుగా మతి స్థిమితం లేక రోడ్లపై నగ్నంగా తిరుగుతున్న ఓ యువతికి తాడేపల్లి పోలీసులు వస్త్రాలు తొడిగి సపర్యలు చేశారు. అనంతరం సీఐ కళ్యాణ్ రాజు ఆదేశాల మేరకు యువతిని స్త్రీ శిశు సంక్షేమశాఖ అధికారులకు అప్ప గించారు. ప్రజలకు రక్షణ కల్పించడమే కాదు.. ఆపన్న హస్తం అందించడంలోను ముందుంటామని తాడేపల్లి పోలీసులు నిరూపించారు. తాడేపల్లి పోలీసుల సేవలను అభినందిస్తూ, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అనుకున్న లక్ష్యాలను సాధించండి: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : విద్యార్థులు అనుకున్న లక్ష్యాలను సాధించాలని గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అన్నారు. విజ్ఞాన్స్ యూని వర్సిటీలో యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యూత్ ఫెస్టివల్ కాంపిటీషన్స్‌ను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ యువజ నోత్సవాలను 'ఇన్నోవేషన్ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ' అనే ఇతివృత్తంతో నిర్వహించారు. గుంటూరు జిల్లాలోని వివిధ కాలేజీల నుంచి పెద్దఎత్తున హాజరైన విద్యార్థులకు పోటీల్లో భాగంగా స్టోరీ రైటింగ్, చిత్రలేఖనం, డెక్లమేషన్, పొయిట్రీ, గ్రూప్ ఫోక్ డాన్స్, గ్రూప్ ఫోక్ సాంగ్, సోలో ఫోక్ డాన్స్, సోలో ఫోక్ సాంగ్, ప్రాజెక్ట్ ఎక్స్‌పోలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి యువజనోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశానికి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన స్వామి వివేకానందను స్మరించుకుంటూ ఈ యువజనోత్స వాలను నిర్వహించడం చాలా సంతోష మన్నారు. ఇటువంటి కార్యక్ర మాల్లో విద్యార్థులు పాల్గొనడం ద్వారా బృంద స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు, కమ్యూ నికేషన్ స్కిల్స్ పెరుగుతాయ న్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్న్‌షిప్ లు కూడా అందిస్తుందని తెలియజేసారు.

ఫిట్‌నెస్ కోసం పాలసీ రావాలి : విద్యార్థుల ఫిట్‌నెస్ కోసం ప్రభుత్వాలు ప్రత్యేకమైన పాలసీ తీసుకురావాలని విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య అన్నారు. విద్యార్థులం దరకీ చిన్న వయసు నుంచే ఫిజికల్ ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యతనిచ్చి స్పోర్ట్స్, ఎన్సీసీ, ఎన్ఎస్ఎస్ వంటి కార్యక్ర మాల్లో పాల్గొనేలా చూడాలన్నారు. తమ యూనివర్సిటీలోని విద్యార్థులకు ఫిజికల్ ఫిట్‌నెస్‌కు, ఆరోగ్యానికి సంబంధించి క్రెడిట్స్ అందిస్తున్నామని తెలియజేసారు. ఆయా పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేయడంతో పాటు రాష్ట్రస్థాయి యువజనోత్సవాలకు ఎంపికైనట్లు తెలియజేసారు. కార్యక్రమంలో ప్రముఖ సైకాలజిస్ట్ ప్రత్యూష సుబ్బారావు, స్టెప్ సీఈవో టి.విజయలక్ష్మి, వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీలకు ఇచ్చిన హామీలపై చంద్రబాబు స్పష్టత ఇవ్వాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ముస్లిం, మైనార్టీలకు ఇచ్చిన హామీలను ఎప్పటి నుంచి అమలు చేస్తారనే విష యాన్ని మైనార్టీ సంక్షేమ దినోత్సవం రోజున ముస్లిం మైనా ర్టీలకు స్పష్టత ఇవ్వాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు షేక్ నాగుల్ మీరా డిమాండ్ చేశారు. శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లా డారు. ఎన్నికల వేళ ముస్లింలకు అండగా ఉంటామని హామీ ఇచ్చి.. వక్ఫ్ చట్ట సవరణ బిల్లుకు మద్దతు ఇచ్చి ముస్లింల గొంతు కోశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అల్లాహ్ ఆస్తులు దోచుకోవడానికి బీజేపీ పన్నిన పన్నాగంలో చంద్రబాబు భాగస్వామ్యమయ్యారని ఆయన దుయ్యబట్టారు. నారా లోకేష్ యువగళం పాదయాత్రలో.. చంద్రబాబు నాయు డు ఎన్నికల ప్రచా రంలో వక్ఫ్ ఆస్తులు కాపాడతామని, 2019-24 మధ్యన ముస్లిం, మైనార్టీలపై జరిగిన అఘాయిత్యాలపై మూడు నెలలో బాధితులకు న్యాయం చేస్తాన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అలాగే ఉర్దూ స్పెషల్ డీఎస్సీ, దుల్హన్ పథకం, దుకాన్-మకాన్ పథకం, ఎంఎఫ్సీ ద్వారా సబ్సిడీ రుణా లు, ఇస్లామిక్ బ్యాంక్ విధానం.. విజయవాడలో హజ్ హౌస్ నిర్మాణం..ఇలా ఎన్నో హామీలు ముస్లిం, మైనార్టీలకు ఇచ్చి అధికారం వచ్చి 6 నెలలు అవుతున్నా ఇప్పటికీ ఏ ఒక్క హామీని అమలు చేయని ఈ ప్రభుత్వానికి మైనార్టీ సంక్షేమ దినోత్సవం నిర్వహించే నైతిక హక్కు లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. అధికారం వచ్చి 6 నెలలు అవుతున్నా మౌజన్, ఇమామ్‌ల గౌరవ వేతనం ఇవ్వలేదని, అదే దేవాలయాల అర్చకులకు, దేవాలయాలకు ఇచ్చిన హామీని నెరవేర్చి అమలు చేస్తున్నారన్నారు. బీజేపీ పెద్దలకు భయపడి ముస్లిం మైనార్టీలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయకపోవడమే కాకుండా వక్ఫ్ చట్ట సవరణ బిల్లుకు కూడా మద్దతు ఇచ్చారని మండిపడ్డారన్నారు.

షెడ్ల నిర్మాణాలు చేపట్టాలి : ఎంపీడీఓ

విశాలాంధ్ర-దుర్గి: మండలంలో మినీ గోకులం షెడ్లు (పశు వుల పాక) మంజూరైన లబ్ధిదారులు త్వరగా నిర్మాణాలు చేపట్టాలని ఎంపీడీవో శివప్రసాద్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉపాధి హామీ కార్యా లయం ఆధ్వర్యంలో మినీ గోకులం షెడ్లు నిర్మాణాలపై లబ్ధి దారులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మండలానికి 25 మినీ గోకులం షెడ్లను కలెక్టర్ మంజూరు చేయడం జరిగిందని, లబ్ధిదారులు సంబంధిత పత్రాలను ఉపాధి హామీ కార్యాలయంలో అందజేసిన వెంటనే నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కోరారు. దుర్గి, ముటుకూరు పశు వైద్యాధికారులు డా.దిలీప్, డా.నాగవల్లి మాట్లాడుతూ ఎండలు,వర్షాల నుంచి పాల దిగుబడి తగ్గకుండా పశు వులకు నీడ కల్పించేందుకు ఒక సురక్షితమైన షెడ్(పాక) కల్పించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ పథకాన్ని తెచ్చారన్నారు. ఏపీఓ జి.చినవెంకటేశ్వర్లు మాట్లా డుతూ నిధులు సిద్ధంగా ఉన్నాయని షెడ్ నిర్మాణాలు చేప ట్టాలని కోరారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ఈవోపీఆర్డీ సత్యప్రసాద్, ఈసీ రవీంద్ర నాయక్, టీఏ గోవిందరాజు, లబ్ధిదారులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఎంలో విజయ సూత్రాలపై చర్చాగోష్టి

విశాలాంధ్ర-మంగళగిరి : ఏపీ ఎస్ఆ ర్ఎం యూనివర్సిటీలో శుక్రవారం పారిశ్రామిక, వ్యాపార రంగాల్లో విజ య సూత్రాలను విశ్లేషిస్తూ ఆసక్తికర చర్చాగోష్టి జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి పేరున్న పారిశ్రామిక రంగ నిపుణులు హాజరై బిజినెస్ స్కూల్ విద్యార్థులకు విజయ సూత్రాలను వివ రించారు. పారీ స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్, ఇన్‌ఛార్జ్ వీసీ ఆచార్య భరద్వాజ్ శివకు మారన్ చర్చాగోష్టికి సంధాన కర్తగా వ్యవహరించారు. ప్రధానంగా అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిచేం దుకు అవసరమైన సూత్రా లను, మార్గ దర్శకాలను నిపుణులు చర్చించారు. సమర్థవంతమైన నాయ కత్వం, వ్యక్తిగత, సాంకేతిక నైపు ణ్యాలు, విషయ అవగాహన వంటివి విజయ తీరాల వైపు నడిపిస్తాయని చర్చా గోష్టిలో పాల్గొన్న నిపుణులు అభిప్రాయపడ్డారు. బ్రి మెలన్ డైరెక్టర్ శ్రీధరన్, పెప్సికో అసిస్టెంట్ డైరెక్టర్ వరుణ్ గుప్తా, కిమ్స్ ఫౌండేషన్ అండ్ రీసెర్చ్ సెంటర్ చైర్మన్ డాక్టర్ భుజంగ రావు, అనలిటిక్స్ అండ్ స్ట్రాటజీస్ డైరెక్టర్ సురేష్ పొన్నూరు, కార్పొరేట్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ వినయ్ మంతా వంటి ప్రము ఖులు చర్చాగోష్టిలో పాల్గొని తమ తమ రంగాల్లో ఎదురైన అనుభవాలు, సాధించిన విజయాలు, అందుకు దోహదపడ్డ అంశాలను వివరిస్తూ, కీలకమైన విజయ సూత్రాలను బిజినెస్ స్కూల్ విద్యార్థులకు వివరించారు. విద్యార్థుల ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. వర్సిటీ డైరెక్టర్లు, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

శానిటేషన్ పనుల పరిశీలన

విశాలాంధ్ర-తెనాలి : పురపాలక సంఘ పరి ధిలోని 32వ వార్డులో శుక్రవారం తెనాలి పురపాలక సంఘ ఛైర్ పర్సన్ తాడిబోయిన రాధిక, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు శానిటేషన్ పనులను పరిశీలించారు. శానిటేషన్ వర్కర్లు శ్రమ అనుకోకుండా తమ వంతుగా పరిశుభ్రత పట్టణంగా తెనాలి తీర్చిదిద్దాలని కోరారు. శానిటేషన్ సిబ్బందికి తగిన సూచనలనిచ్చారు. అసిస్టెంట్ ఇంజనీర్ సునీల్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హెలెన్ నిర్మల, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ శాఖలో సంస్కరణలు

విశాలాంధ్ర-తెనాలి : ఖాతాదారుల సౌకర్యార్థం పోస్టల్‌శాఖలో అనేక నూతన సంస్కరణలు చేసినట్టు తెనాలి పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ జి.కరుణాకర్ బాబు తెలిపారు. పట్టణంలోని హెడ్‌పోస్టాఫీస్ ఆవర ణలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖాతాదారులు బ్రాంచ్‌తో సంబంధం లేకుండా దేశంలోని ఏ పోస్టాఫీస్‌లోనైనా ఖాతాపరమైన సేవలు పొందవచ్చన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలకు సంబంధించిన నగదు జమ కావాలంటే నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మ్యాపర్లో ఆధార్‌కార్డుకు ఖాతాదారుడి ఖాతా నంబరు జతచేసి ఉండాలని చెప్పారు. నేటికి ఈ అనుసంధానం కాని బ్యాంకు ఖాతాలు లక్షల్లో ఉన్నాయని చెప్పారు. దీంతో లబ్ధిదారుడి ఖాతాకు నగదు బదిలీ డబ్బులు జమకాని పరిస్థితి నెలకొందన్నారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న 1.26 లక్షల ఖాతాలను తెనాలి డివిజన్ వ్యాప్తంగా ఉన్న 271 పోస్టాఫీసుల ద్వారా తెరవడం ఆధార్‌ను అనుసంధానం చేయడం జరుగుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

విశాలాంధ్ర-పెద కాకాని: పల్నాడు జిల్లా చిలకలూరిపేట వాస్త వ్యులు షోడా రత్నాచారి ధర్మపత్ని లక్ష్మీ కనకదుర్గ దంపతులు శుక్రవారం దేవస్థాన నిత్య అన్నదాన పథకమునకు రూ.50,000లు విరాళం అందించినట్లు దేవస్థాన ఉప కమిషనర్, కార్యనిర్వహణాధికారి కె.బి. శ్రీనివాసరావు తెలిపారు. ఆలయ అభివృద్ధికి, నిత్య అన్నదాన పథకమునకు భక్తులు విరివిగా విరాళము సమర్పించి ఆలయ అభివృద్ధికి సహకరించవలసిందిగా ఉప కమిషనర్ భక్తులకు విజ్ఞప్తి చేశారు. దాతలకు ప్రత్యేక దర్శనం చేయించి, శ్రీ స్వామివారి శేష వస్త్రంతో సత్కరించారు.

రేపు మహారుద్రాభిషేకం

విశాలాంధ్ర - వినుకొండ : వినుకొండ జూనియర్ కాలేజీ గ్రౌండ్ నందు ఆదివారం సాయంత్రం 6 గంట లకు లోక కళ్యాణార్థం మహా రుద్రాభిషేకం కార్యక్రమం జరుగును. ముఖ్య అతిథులుగా అమ్మ చారిటబుల్ ట్రస్ట్ బాబా వారి ఆశీస్సులతో స్వయంగా వారే పాల్గొని మహా రుద్రాభిషేకాన్ని నిర్వహిస్తున్నట్లు కమిటీ వారు తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం పట్టణంలోని జూనియర్ కాలేజీ గ్రౌండ్ నందు మెల్లిగండ్ల సమావేశంలో నాయ కులు మాట్లాడుతూ. ఈ మహా రుద్రాభిషేకం కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తున్నారని, అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు మరియు శాసనసభ్యులు జీవి ఆంజనేయులు, మక్కెన మల్లికార్జున రావు ఆశీస్సులతో నిర్వహిస్తున్నట్టు కమిటీ వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో లాయర్ సైదారావు, జెట్టి శ్రీనివాసరావు, శివశక్తి మేనేజర్ గాలి రమణారావు, మాటమర్రి నరసింహారావు, జవ్వాజి పూర్ణ, పటాన్,దస్తగిరి పాల్గొన్నారు.

ఆర్థిక అభివృద్ధికి కృష్ణామిల్క్ అహర్నిశలు కృషి

విశాలాంధ్ర-బంటుమిల్లి : పాల ఉత్పత్తిదారుల అభ్యున్నతి, ఆర్థిక అభివృద్ధికి కృష్ణామిల్క్ యూనియన్ అహర్నిశలు కృషి చేస్తుందని కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. మండల పరిధిలోని ముంజులూరు గ్రామంలో ఉన్న ముంజులూరు పాల ఉత్పత్తి దారుల పరస్పర సహాయక సహకార సంఘంను కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు శుక్రవారం సందర్శించి పాల ఉత్పత్తి దారుల సమస్యలు అడిగి తెలుసుకుని పాల ఉత్పత్తిదారులకు మేలైన యాజమాన్య పద్ధతులు, మెరుగైన పశుపోషణకు సంబంధించి పలు సూచ నలు చేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ పాల ఉత్పత్తి దారుల సంక్షేమానికి కృష్ణామిల్క్ యూనియన్ అనేక సంక్షేమ కార్యక్ర మాలు ప్రవేశ పెట్టిందని తెలిపారు. పాల ఉత్పత్తిదారులకు ప్రతి నాలుగు మాసాలకు ఒకసారి 10% చొప్పున ధర వ్యత్యాసం (బోనస్) పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. క్షీర బంధు, కళ్యాణమస్తు, ప్రతిభ వంటి పథకాలతో పాటు పశువులకు ఉచితంగా పశు వైద్య శిబిరాలు జలగ ముందు అందిస్తున్నామన్నారు. సబ్సిడీపై 20% ప్రోటీన్ కలిగిన పశుదాణా, పశువులకు మేలుజాతి కృత్రిమ గర్భోత్పత్తి సేవలు రూ.50 లకే చేయడం జరుగుతుందన్నారు. పాలఉత్పత్తి దారులకు ఎటువంటి సమస్యలు ఉన్న వాటిని పరిష్కరించడానికి కృష్ణామిల్క్ యూనియన్ అహర్ని శలు కృషిచేస్తుందని పాడి రైతులకు భరోసా కల్పించారు. కార్యక్రమంలో జిల్లా యూనియన్ పాలక వర్గ సభ్యులు అర్జా వెంకట నగేష్, గుడ్లవల్లేరు పాల శీతలీకరణ కేంద్రం మేనేజర్ తోట సత్యనారాయణ, పాల ఉత్పత్తిదారుల సంఘ అధ్యక్షులు కూనపరెడ్డి శ్రీనివాసరావు, సూపర్వైజర్ చొప్పకట్ల వర ప్రసాద్, కార్యదర్శి నాగార్జున, టెస్టర్ మేరి, పాల ఉత్పత్తి దారులు పాల్గొన్నారు.

స్కై మీట్స్ సీ డెమోకు పటిష్ట బందోబస్తు

విశాలాంధ్ర-విజయవాడ (వన్టౌన్): స్కై మీట్స్ సీ డెమోకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. శుక్రవారం పోలీస్ కమిషనర్ ఎస్వీ.రాజశేఖర్బాబు బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఈనెల 9వతేదీన రాష్ట్ర ప్రభుత్వం సీ ప్లేన్ సర్వీసును ప్రతిష్టాత్మకంగా విజయవాడ పున్నమి ఘాట్లో స్కై మీట్స్ సీ పేరుతో సీ ప్లేన్ డెమో కార్యక్రమం చేపట్టింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరవుతారు. ముఖ్యంత్రి పర్యటన సందర్భంగా పున్నమి ఘాట్ పరిసర ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. రాజశేఖర్బాబు మాట్లాడుతూ విజయవాడ నుంచి శ్రీశైలం మధ్య ప్రయోగాత్మకంగా సీ ప్లేన్ సర్వీసు డెమోను నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ప్రారంభిస్తారన్నారు. పున్నమి ఘాట్ ప్రాంతాల్లో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకొని భద్రత పరంగా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనంతరం అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో ఇన్ఛార్జ్ కలెక్టర్ డాక్టర్ నిధి మీనా, డీసీపీలు గౌతమిషాలి, ఏబీటీ ఎస్ ఉదయరాణి, కృష్ణమూర్తి నాయుడు, ఎస్వీడీ ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్,ఏడీసీపీ రామ కృష్ణ, ఏసీపీలు, రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

విశాలాంధ్ర - గుడివాడ : ఇటీవల స్థానిక ఆటోనగర్లో పనిచేస్తున్న కె.శ్రీను షెడ్డులో కంటైనర్ పనిచేస్తున్న తమ్మిశెట్టి నరసింహారావుకు గాయం కావడంతో ది కృష్ణాజిల్లా ఇండస్ట్రియల్ &ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్, ఆటోనగర్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం కార్మికుని కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు అబ్దుల్ హమీద్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ కుద్దుస్, సిఐటియు పట్టణ కార్యదర్శి టి.లక్ష్మణరావు నాయకులు బొబ్బరపల్లి ఆంజనేయులు, ఎండి రఫీద్బేగ్, ఎస్.ఎం మొహిద్దిన్బాషా, రెడ్డి నాగరాజు, మత్తి ఉపేంద్ర, వడ్లని గాంధీ, అన్నమనేడి వెంకటరమణలు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ పట్టణ ప్రణాళిక దినోత్సవం

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : నవంబర్ 8వ తేదీ ప్రపంచ పట్టణ ప్రణాళిక దినోత్సవం సందర్భంగా రాష్ట్ర పట్టణ ప్రణాళిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన ఓ కార్యక్రమంలో సంఘం ప్రతినిదులు అధికారులు, సిబ్బందికి శు భాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర పట్టణ ప్రణాళిక సంఘం అధ్యక్షుడు కె.వెంకటేశ్వర రావు, ఉపాధ్యక్షులు అబ్దుల్ సత్తార్, కార్యదర్శి మోహన్బాబు, రాష్ట్ర పట్టణ ప్రణాళిక సంచాలకులు ఆర్జే. విద్యుల్లత, అదనపు సంచాలకులు శ్రీనివాసులు, పట్టణ ప్రణాళిక ముఖ్య అధికారి ప్రభాకర్రావు, రాష్ట్ర పట్టణ, గ్రామ సంచాలకులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో విద్యుల్లత మాట్లాడుతూ ప్రస్తుత దేశ, రాష్ట్ర అభివృద్ధిలో పట్టణ ప్రణాళిక శాఖ ప్రముఖ పాత్ర పోషిస్తుం డటంతో పాటు పట్టణ ప్రణాళిక మౌలిక సదుపాయముల కల్పనలో, పట్టణాలు ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి చెందేందుకు భాధ్యతగా వ్యవహరి స్తోందని తెలిపారు. పట్టణ ప్రణాళిక సిబ్బంది, పట్టణ ప్రణాళిక ప్రాముఖ్య తను ప్రజల్లోకి తీసుకువెళ్ళి, ప్రణాళిక బద్ధంగా గృహ నిర్మాణాలు చేపట్టేం దుకు సహకరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీపీఓ జోనల్ ప్రెసిడెంట్ వసీం బేగ్, టీపీఓ శైలజ, ట్రెజరర్ కృష్ణ, ప్లానింగ్ ఆఫీసర్ నాయుడు, పట్టణ ప్రణాళిక అధికారులు పాల్గొన్నారు.

బాలల సంరక్షణ కేంద్రాలను రిజిస్ట్రేషన్ తప్పనిసరి

జిల్లా అధికారి సత్యవతి

విశాలాంధ్ర బ్యూరో- మచిలీపట్నం : జువైనల్ జస్టిస్ చట్టం ప్రకారం బాలల సంరక్షణ కేంద్రాలను తప్పని సరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కృష్ణా జిల్లా పర్య వేక్షణ అధికారి సత్యవతి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ బాలల సంస్కరణల సేవల శాఖ అధికారులు ప్రకటన విడుదల చేశారని తెలి పారు. నవంబరు 11వ తేదీ లోగా నిర్దేశించిన ఫార్మాట్ లో దరఖాస్తు ఫారంను విజయవాడ కార్యాలయానికి పంపాలన్నారు. తదుపరి సమాచారం కొరకు 910045 423 కిగాని, జిల్లా బాలల సంరక్షణ అధికారి మోనిషా 9398583329 నెంబరుకు సంప్రదించాలన్నారు.

చేనేత కార్మికులకు నిత్యావసర సరకులు వితరణ

విశాలాంధ్ర-పెడన : పెడన వాస్తవ్యులు కీ.శే. కొలుకుల మహదేవమూర్తి పుణ్యతిథిని పురస్కరిం చుకుని వారి కుమారుడు ప్రస్తుతం హైదరాబాద్ నివాసి కొలుకుల జయ శంకర్ వారి ఆర్థిక సౌజన్యంతో బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల పెడన లైబ్రరీసైన్స్ అధ్యాపకులు పేరిశెట్టి నాగరవి ఆధ్వర్యంలో నేడు పెడన 8వార్డు జోగానందరావు కాలనీలో నివసిస్తున్న బళ్ళ సుబ్రహ్మణ్యం గారు గత కొంతకాలంగా (పెరాలసిస్) అనారోగ్యంతో బాధపడుతున్న వారితో పాటుగా అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందుల వల్ల కుటుంబ నిర్వహణ భారంగా మారిన మరో నాలుగు చేనేత కార్మికుల కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రెండు వేల రూపాయల విలువచేసే బియ్యం మరియు నిత్యావసర వస్తువులను 30సార్లు రక్తదానంతో ప్రాణదానం చేసినసామాజిక కార్యకర్త పిచ్చుక నిరంజనరావు ముఖ్యఅతిథిగా హాజరైన నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా పేరిశెట్టి నాగరవి మాట్లాడుతూ సుదూర ప్రాంతాల్లో నివసిస్తున్నా జన్మభూమి పై ఉన్న మమకారంతో తోటి చేనేత కార్మికులు పడుతున్న ఇబ్బందులు తెలియజేయడంతో సుమారు పదివేల రూపాయల విలువైన నిత్యావసర వస్తువుల పంపిణీ చేయించిన జయశంకర్ గారికి ధన్యవాదాలు తెలిపారు. అదే సమయంలో దాతల స్ఫూర్తిని అర్థం చేసుకుని నిత్యావసర వస్తువులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పేరిశెట్టి నాగరవి, పిచ్చుక నిరంజనరావు మరియు చేనేత కార్మికులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర-పెదపారుపూడి: రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్లో రైతు పండిం చిన వరి పంటకు గిట్టుబాటు ధరతో పాటు ధాన్యాన్ని తన ఇష్టం వచ్చినట్లు అమ్ము కోవడానికి రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతులకు ప్రత్యేక వెసులుబాటు కల్పించి నట్లు శుక్రవారం పామర్రు ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా అన్నారు. అంతకు ముందు మండలం లోని వెంట్రప్రగడ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ రైతే లేనిదే రాజ్యం లేదని, రైతు కోసం తమ ప్రభుత్వం అహర్నిశలు పనిచేస్తుందన్నారు. పండించిన వరి పంట సాధారణ రకం 75 కేజీల బస్తాకు రూ.1725లు, గ్రేడ్ 'ఏ' రకం 75 కేజీల బస్తాకు రూ.1740లు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పిస్తుందని ఎమ్మెల్యే వివరిం చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, ఆ పార్టీ లీగల్ విభాగం మండల శాఖ అధ్యక్షుడు గొరిపర్తి రవికుమార్, మండల ప్రజా పరిషత్ మాజీ అధ్యక్షుడు పునుకొల్లు వెంకటరత్న ప్రసాద్ (పాపాయి), ఉజ్జునేని అనిల్ కుమార్, దూళ్ల జమ్మి బాబు, దానబోయిన వెంకటనారాయణ, పాగోలు కాటంరాజు, కాగిత లక్ష్మీ నారాయణ, కలపాల కిషోర్, దగాని లెనిన్, తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి క్రీడలు దోహదం



విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్ : విద్యాభివృద్ధికి క్రీడలు దోహదపడతా యని చదువుతోపాటు క్రీడల్లోనూ పాల్గొ నాలని శాతవాహన కళాశాల కరస్పాండెంట్ సత్యనారా యణ పిలుపు నిచ్చారు. గాంధీ నగర్లోని జింఖానా స్విమ్మింగ్ పూల్ లో క్రిష్ణ యూనివర్సిటీ అంతర్ కళాశాలల స్విమ్మింగ్ పోటీలను, యూని వర్సిటీ జట్టు ఎంపికలను శుక్రవారం నిర్వహించారు. ఈ పోటీలను శాతవాహన కళాశాల కరస్పాండెంట్ నిడుమోలు రమా సత్య నారా యణ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. వర్సిటీ పరిధిలోని ఆరు కళాశాలల నుండి స్విమ్మర్లు టోర్నీలో పాల్గొన్నారన్నారు. వర్సిటీకి ఎంపికైన స్విమ్మర్లు అత్యు త్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించాలన్నారు. టోర్నమెంట్ సెలక్షన్ కమిటీ సభ్యులు డాక్టర్ డి యుగంధర్, డి. హేమ చంద్రరావు, టోర్నమెంట్ కార్యనిర్వా హక కార్యదర్శి బి సి హెచ్ సంగీతరావు పాల్గొన్నారు.

రీసర్వే గ్రామసభల ద్వారా155 దరఖాస్తులు

విశాలాంధ్ర- కూచిపూడి : మొవ్వ మండలంలో గత ఏడాది అక్టోబర్ నుంచి ఈ ఏడాది జనవరి వరకు 11 గ్రామాలలో నిర్వహించిన భూముల రీ సర్వేలో భూ సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసిన గ్రామసభల ద్వారా 155 దరఖాస్తులు అందినట్లు రీ సర్వే డిప్యూటీ తాసిల్దార్ పి జగన్ మోహన రావు, మండల సర్వేయర్ ఏ.కిషోర్ శుక్రవారంతెలిపారు. గత నెల 24 నుంచి ఈనెల 7వ తారీకువరకు నిర్వహించిన ఈ గ్రామసభల ద్వారా వచ్చిన అర్జీల పరిష్కారం ప్రభుత్వం నిర్ణయించిన సమయానికి పూర్తవుతాయని తెలిపారు. మండలంలో అధికంగా పెదముత్తేవి గ్రామంలో 63 అర్జీలు రాగా తక్కువగా యద్దనపూడి లో 3 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. గ్రామసభలో జరిగిన గ్రామాలైన బార్లపూడిలో 4, అవురుపూడిలో14, కూచిపూడి లో 4 అయ్యం కిలో16, పెదసనగల్లులో 8,పాలంకిపాడులో15, పెదపూడి లో 6, గూడ పాడులో6, చినముత్తేవిలో 16, అర్జీలను రైతులు దాఖలు చేసినట్లు వివరించారు.

కార్తీకమాస ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు

విశాలాంధ్ర-విస్సన్నపేటటౌన్: కార్తీకమాసం సందర్భ ంగా జరిగే మాసోత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు స్థానిక గంగా పార్వతీ సమేత చంద్రశేఖర స్వామి దేవాలయం చైర్మన్ వెంపటి శ్రీకృష్ణ జనార్దనరావు తెలిపారు. తాను చైర్మన్‌గా నియమితులైన తరువాత జరిగే తొలి ఉత్సవాలు కావట ంతో వీటి నిర్వహణ విషయంలో అత్యంత బాధ్యతా యుతంగా వ్యవహరిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రధానంగా భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యే కార్తీక పౌర్ణమి, మహాన్యాస రుద్రాభిషేకం, కుంకుమాభిషేక కార్యక్రమాలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారిపై కేసు నమోదు

విశాలాంధ్ర-కంచికచర్ల: కంచికచర్ల మండలంలోని కీసర గ్రామం వద్ద శుక్రవారం అక్రమంగా ఇసుకను ట్రాక్టర్ ద్వారా తరలించి లారీకి అక్రమంగా ఇసుక లోడ్ చేస్తుండగా స్థానిక పోలీసులు పట్టుకున్నారు. ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న లారీ మరియు ట్రాక్టర్ ను పట్టుకొని కంచికచర్ల ఎస్సై కేసు నమోదు చేయడమైనది. ఈ విషయమై స్థానిక ఎస్సై బోనగిరి రాజు మాట్లాడుతూ అక్రమంగా ఇసుక తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సుఖ అవసరమైన వారు పరిమిషన్ తీసుకొని ఇసుక తీసుకెళ్లాలని లేనిపక్షంలో వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఆత్కూరు గ్రామాన్ని సోలార్ విలేజ్‌గా తయారు చేస్తాం : కలెక్టర్

విశాలాంధ్ర-గన్నవరం: పిఎం సూర్య ఘర్ పథకం క్రింద ఆత్కూరు గ్రామాన్ని మోడల్ సోలార్ విలేజ్ గా తయారు చేసేందుకు ఈ పథకం పట్ల తగిన అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. ఆత్కూరు స్వర్ణ భారత్ ట్రస్ట్ సమావేశపు హాలులో శుక్రవారం కలెక్టర్ సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పిఎం సూర్యా ఘర్ మంచి పథకం,దీని ప్రయోజనాలు వివరిస్తూ ఆత్కూరు గ్రామంలో ఈ పథకం నూరు శాతం వినియోగించుకునేలా తగిన అవగాహన కల్పించాలని అన్నారు. ఇప్పటికే ఈ పథకం కింద ప్రయోజనం పొందిన వారిచే వారి అనుభవాలు వివరించేలా చూడాలన్నారు. ఆత్కూరు గ్రామంలో శానిటేషన్ ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయని శానిటేషన్ మెరుగుపరచాలని ఆదేశించారు. తొలుత స్వర్ణభారత్ ట్రస్ట్ ఈడి డి పరదేశి ట్రస్టు కార్యకలాపాలు కలెక్టర్కు పవర్ పాయింట్ ప్రజెంట్ ద్వారా వివరించారు. అనంతరం డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లో వివిధ ట్రేడ్లలో శిక్షణ కార్యక్రమాలు కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఆత్కూరు గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం కలెక్టర్ పరిశీలించారు. త్వరగా ఈ భవనం ప్రజలకు అందుబాటులోకి వచ్చేలా కృషి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.గుడివాడ ఆర్డిఓ బాలసుబ్రమణ్యం, జెడ్పి సీఈవో కన్నమ నాయుడు, ఎల్డిఎం జయవర్ధన్, పీఎం సూర్యఘర్ పథకం నోడల్ అధికారులు విద్యుత్ శాఖ అధికారి భాస్కర్ రావు, నెడ్ కాప్ అధికారి మౌలాలి, తాసిల్దార్ జే. విమలకుమారి, తదితరులు పాల్గొన్నారు.

అంతర్ జిల్లా దొంగల అరెస్టు

రూ.10 లక్షల బంగారం, వెండి ఆభరణాలు, ద్విచక్ర వాహనం స్వాధీనం

విశాలాంధ్ర-మంగళగిరి : నేర నియంత్రణలో నిఘా నేత్రాలు ఎంతో ముఖ్యమైనవని మంగళగిరి ఎర్రబాలెం, నవులూరు, గ్రామంలో జరిగిన వరుస దొంగతనాలు నిఘా నేత్రాల ద్వారా మంగళగిరి రూరల్ పోలీసులు చేదించారని మంగళగిరి నార్త్ సబ్ డివిజన్ డీఎస్పీ మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం మంగళగిరి రూరల్ సర్కిల్ పోలీస్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ మంగళగిరి రూరల్ ప్రాంతాలలో పలుచోట్ల దొంగతనాలు జరిగినట్లు ఫిర్యాదుదారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా పలు ఇళ్లల్లో ఇంటి తాళాలు గుణపాలతో పగలగొట్టి డబ్బు, బంగారం, వెండి వస్తువులు దొంగలించినట్లు గుర్తించడం జరిగిందన్నారు. అంతర్ జిల్లా దొంగ తోట శివకుమార్ అనే వ్యక్తిని అతనికి సహకరించిన ఇమిడి నాగేశ్వరరావు పోలీసులు అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.10 లక్షల విలువచేసే బంగారం, వెండి ఆభరణాలు ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల ప్రజలు ఊర్లకు, వేడుకలకు వెళ్లేటప్పుడు ఇంటి చుట్టుపక్కల వారికి తెలియజేయాలని, అదేవిధంగా ఎల్‌హెచ్ఎంఎస్ వినియోగం చుకోవాలని కోరారు. అలాగే వ్యాపార సముదాయాల వద్ద గ్రామ కూడలిలో నిఘా నేత్రాలను ఏర్పాటు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

బాబా ప్రసాద్‌కు సతీవియోగం

విశాలాంధ్ర-మచిలీపట్నం : మున్సిపల్ మాజీ చైర్మన్, మోటమర్రి వెంకట బాబా ప్రసాద్ సతీమణి మోట మర్రి శ్రీదేవి శుక్రవారం మృతి చెందారు. ఈ సంద ర్భంగా కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కొన కళ్ళ నారాయణరావు, రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహణ కార్యదర్శి కొనకళ్ళ జగన్నాధరావు (బుల్లయ్య) జిల్లా పార్టీ కార్య నిర్వహణ కార్యదర్శి బత్తిన దాస్ ఆమె భౌతిక గాయానికి నివాళులర్పించారు.

CHANGE OF NAME

I, **KATRAVATH SARASWATHI** (Old Name), W/o. **Bathula Chandra Sekhar**, Resident of Door No.8-9-58, 2nd Lane, Nehru Nagar, Guntur - 522001, Guntur District, Andhra Pradesh. I have changed my name to **BATHULA SARASWATHI** (New Name) W/o. **Bathula Chandra Sekhar.** Hereafter my name is known as **BATHULA SARASWATHI** (New Name) W/o. **Bathula Chandra Sekhar.**

CHANGE OF NAME

I, **KOLISETTI RAMADEVI** (Old Name), **W/o. KOLISETTY VENKATA SIVA RAMA MOHAN RAO,** resident of F.No: 502, Satya Sadan Apartments, 5/18, Brodipet, Guntur, Guntur District, A.P. I have changed my name as **KOLISETTY RAMADEVI** (New Name), **W/o. KOLISETTY VENKATA SIVA RAMA MOHAN RAO,** Hereafter my name is known as **KOLISETTY RAMADEVI** (New Name), **W/o. KOLISETTY VENKATA SIVA RAMA MOHAN RAO.**

రీసర్వే పై సమస్యలు పరిష్కారానికి గ్రామసభ

విశాలాంధ్ర-పమిడిముక్కల: నవంబరు 08: హనుమంత పురంలో రీసర్వే పై సమస్యలు పరిష్కారానికి గ్రామసభ నిర్వహిం చారు. శుక్రవారం సదరు గ్రామం లో గత సంవత్సరం అక్టోబర్ నుంచి ఈ ఏడాది జనవరి వరకు నిర్వహించిన భూముల రీసర్వే పై వచ్చిన పలు సమస్యలు పరిష్కారానికి నిమిత్తం ఏర్పాటు చేసిన గ్రామ సభకు రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అపార్ సమస్య పరిష్కారానికి వెసులుబాటు

- విశాలాంధ్ర కథనానికి స్పందన

విశాలాంధ్ర-విస్సన్నపేట : విద్యాశాఖ జిల్లావ్యాప్తంగా చేపట్టిన ప్రభుత్వ విద్యార్థుల అపార్ కార్డు రూపకల్పనలో ఎదురయ్యే ఇబ్బందులపై విద్యాశాఖ అధికారులు స్పందిం చారు. ఆధార్ వివరాల్లో తప్పుల కారణంగా అపార్ నమోదులో జాప్యం నెలకొన్న విష యమై గతనెల 28న 'భారంగా అపార్' శీర్షిక తో 'విశాలాంధ్ర'లో కథనం ప్రచురితమైన విష యం పాఠకులకు విదితమే. తాజాగా విద్యా శాఖ జిల్లా ఉన్నతాధికారులు ఈ సమస్య పరి ష్కారానికి మార్గదర్శకాలు రూపొందించారు. ఆధార్‌లో తప్పులు ఉన్నప్పటికీ, అపార్ వివరాల నమోదుకు విద్యాశాఖ రికార్డుల్లో మార్పులు చేసుకునేలా ఆదేశం చారు. జడ్పీ పాఠశాలల హెచ్ఎంలకు, ప్రాథ మిక పాఠశాలలకు సంబంధించి మండల విద్యా శాఖాధికారులకు ఈ వివరాలను సరిచేసే అధికారాలను అప్పగించారు.

CHANGE OF NAME

I, **KOLISETTI VENKATA SIVA RAMA MOHAN RAO** (Old Name), **S/o. KOTESWARA RAO,** resident of F.No: 502, Satya Sadan Apartments, 5/18, Brodipet, Guntur, Guntur District, A.P. I have changed my name as **KOLISETTY VENKATA SIVA RAMA MOHAN RAO** (New Name), **S/o. KOTESWARA RAO,** Hereafter my name is known as **KOLISETTY VENKATA SIVA RAMA MOHAN RAO** (New Name), **S/o. KOTESWARA RAO.**

బహిరంగ ప్రకటన

మా క్లయింటు అయిన గుంటూరుజిల్లా, మంగళగిరి(మం), కురుగల్లు గ్రామ నివాసి ముప్పాళ్ళ వెంకటేశ్వరరావు గారి కుమారుడు అనిల్‌కుమార్ (సెల్: 70757 12223) గారి సూచనల మేరకు యావన్మందికి తెలియజేయునది ఏమనగా. మా క్లయింటు పేరిటిన వున్న ఏ.పి.సి.ఆర్.డి.ఏ. పరిధిలోని గుంటూరు జిల్లా, అమరావతి రి.డి., మంగళగిరి యస్.ఆర్.ఓ. పరిధిలోని మంగళగిరి(మం), కురగల్లు గ్రామం తాలూకు సర్వే నెం.370-1, పట్టా నెం. యస్.నెం.369, ది.19-01-2015 లో య.0-94సెంట్లు దీనిలో నివాసం చ.గ.940లు, వాణిజ్యం చ.గ.235లు మరియు సర్వే నెం.377,పట్టా నెం. యస్.నెం. 369, ది.19-01-2015లో య.0-28సెంట్లు దీనిలో నివాసం చ.గ.280లు, వాణిజ్యం చ.గ.70లు, సర్వే నెం.39-బి,పట్టా నెం. యస్.నెం.369, ది.19-01-2015లో య.0-70సెంట్లు దీనిలో నివాసం చ.గ.200లు, వాణిజ్యం చ.గ.50లు, దీనికి సంబందించిన ఒరిజినల్ దస్తావేజు నెం.9764/2017 అభివృద్ధి ఒప్పందము 9.14బికి అనుబంధ దస్తావేజు వాణిజ్య మరియు 9.14బి నిబంధన 8(8) క్రింద అభివృద్ధి ఒప్పందము మరియు మార్పునకు వీలుకాని ప్రాతినిధ్య అధికారము (పవర్ ఆఫ్ అటార్నీ) దస్తావేజు నెం.9718/2017 గుంటూరుజిల్లా, మంగళగిరి యస్.ఆర్.ఓ. నందు రిజిష్టరు కాబడిన ఈ దస్తావేజులు మరియు ఇతర మరికొన్ని డాక్యుమెంట్లు తీసుకొని ది.04-11-2024న గోరంట్ల సెంటర్‌లో జిరాక్స్ సెంటర్ నుండి ఫోటోస్టాట్ కాపీలు తీసుకొని మరల తన ఇంటికి వెళ్ళు క్రమంలో చూసుకొనగా కనిపించలేదు. చుట్టుప్రక్కల ఎంత విచారించిననూ దొరికియుండలేదు. కావున సదరు దస్తావేజు ఎవరికైనా దొరికిన యెడల మాకుగాని, మాక్లయింటుకు గాని అందజేసినవారికి తగిన బహుమతి ఇవ్వబడును. అట్లుగాక సదరు దస్తావేజును దుర్వినియోగ పరచినయెడల మాక్లయింటు తీసుకొను చట్టపరమైన సివిల్ & క్రిమినల్ చర్యలకు బాధ్యులు కాగలరు.

టి. వాసుదేవ, యం. శ్రీనివాసరెడ్డి, అడ్వకేట్స్
గుజ్జనగుండ్ల, గుంటూరు. సెల్: 7097096758

డాక్యుమెంట్స్ పోయినవి

అప్పికట్ల వెంకటేశ్వరరావు, తండ్రి పాపారావు అనువారికి సంబంధించిన తెనాలి మండలం తేలప్రోలు గ్రామ డి. నెంబరు 824/2లోయ 0.75 చదరపు గజాలు భూమి తాలూకా ఒరిజనల్ డాక్యుమెంట్స్ అంగలకుదురులో పోటోస్టాట్‌కు వెళ్ళుచుండగా బండినుండి జారిపోయినవి. కావున ఎవరికైన దొరికినచో దయచేసి తెలుపగలరు. తగిన బహుమతి ఇవ్వబడును.

సెల్ నెంబర్ :9030305212

CHANGE OF NAME

I, **A SUREKHA** (Old Name), **W/o. KONDADHAR ADUSUMILLI,** resident of D.No.40-12-5/4, AB Residency, Flat No.A, Sitaramanagar, Patamatalanka, Vijayawada-520010, A.P. have Changed my name as **GHANTA SUREKHA** (New Name), **W/o. KONDADHAR ADUSUMILLI,** Hereafter my name is Known as **GHANTA SUREKHA** (New Name), **W/o. KONDADHAR ADUSUMILLI.**

హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

HINDUJA HOUSING FINANCE

కార్పొరేట్ కార్యాలయం: 167-169, 2వ అంతస్తు, అన్నాసలై, సైదాపేట్, చెన్నై-600 015, మరియు దీని బ్రాంచ్‌ల్లో ఒకటైన హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, డి.నం.54-20-10/1ఎ, ప్లాట్ నం: 43, 3వ అంతస్తు, ఎస్బీఐ బ్యాంక్ ఎదుట, మెయిన్‌రోడ్డు, గురునానక్ కాలనీ, విజయవాడ-520 008. CIN U65922TN2015PLC10093, www.hindujahousingfinanace.com

అనుబంధం-4 **స్వాధీనత ప్రకటన** (స్థిర ఆస్తి కొరకు)

ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా.. **హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (హెచ్‌హెచ్‌ఎఫ్ఎల్)** అధీకృత అధికారిగా దిగువ సంతకందారు సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002, నిబంధన 3తో చదివే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించి నోటీసులో ప్రస్తావించిన బకాయి మొత్తాన్ని సదరు నోటీసు అందిన 60 రోజులలోగా చెల్లించవలసిందిగా కింద ప్రస్తావించిన రుణగ్రహీత(లు) / హామీదారు(లు) లకు పిలుపు నిస్తూ అధీకృత అధికారి ద్వారా డిమాండ్ నోటీసు(లు) జారీ చేయడమైనది. రుణగ్రహీత బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు 2002 యొక్క నిబంధన 8తో చదివే చట్టం యొక్క సెక్షన్ 13 లోని ఉప సెక్షన్ (4) కింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించి ఈ కింది వివరించబడిన ఆస్తులను దిగువ సంతకందారు స్వాధీనం చేసుకున్నట్లు రుణగ్రహీత(లు) / హామీదారు(లు) మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది. హామీ పెట్టబడిన ఆస్తిని విడిపించు కోడానికి అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13 యొక్క ఉపసెక్షన్ (8) నిబంధనలను గమనించవలసిందిగా రుణగ్రహీతలను కోరడమైనది. ఈ ఆస్తితో ఎటువంటి లావాదేవీలు నిర్వహించరాదని, ఈ ఆస్తితో ఏదేని లావాదేవీలు ఈ కింద పేర్కొన్న బకాయి మొత్తం మరియు దానిపై వడ్డీకి గాను హెచ్‌హెచ్‌ఎఫ్ఎల్ చార్జికి లోబడి వుంటాయని ప్రత్యేకించి రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమైనది.

వ. సం.	రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/ హామీదారు పేరు/రుణఖాతా సంఖ్య	డిమాండ్ నోటీసు తేదీ & బాకీ మొత్తం	స్వాధీనత తేదీ
1	1. శ్రీ నాగేంద్ర శివరామకృష్ణ పొలన.... రుణగ్రహీత, 2. శ్రీ పెద్ది కాళేశ్వరరావు పొలన....సహ-రుణగ్రహీత 3. శ్రీమతి పొలన పద్మావతి.... సహ-రుణగ్రహీత అందరి ఆర్/ఓ. డి.నం: 12-3, తాడిగడప డొంక రోడ్డు, యనమలకుదురు, కృష్ణాజిల్లా-ఎ.పి-520007. లోన్ అక్కౌంట్ నం. : **AP/VWD/BENZ/A000000133 & AP/VWD/VJDA/A000000220**	11-07-2024 & 28,70,570/- (ఇరవై ఎనిమిది లక్షల డెబ్బై వేల ఐదువందల డెబ్బైరూపాయలు మాత్రమే)	06.11.2024
	హామీగా పెట్టిన ఆస్తి (స్థిర ఆస్తి) వివరాలు : 'ఏ' షెడ్యూల్: కృష్ణాజిల్లా, పటమట సబ్-రిజిస్ట్రీ, పటమట, పెనమలూరు మండలం, యనమలకుదురు గ్రామం & గ్రామ పంచాయతీ యొక్క ఆర్.ఎస్.నం.73/9లో "ఎస్.ఎస్. రెసిడెన్సీ"తో పాటు 421.11 చదరపు గజాలు లేదా 352.10 చదరపు మీటర్ల విస్తీర్ణపు ఆస్తి నుండి 33 చదరపు గజాలు లేదా 27.592 చదరపు మీటర్ల అవిభాజ్య వాటా. హద్దులు: తూర్పు: 24 అ॥ల వెడల్పు రోడ్డు, పడమర: రామలింగేశ్వరస్వామి గుడి ఆస్తి, ఉత్తరం: బి.షణ్ముఖి యొక్క ఆస్తి, దక్షిణం: షేక్ ఇమామ్ ఆస్తి. 'బి' షెడ్యూల్ : పై 'ఏ' షెడ్యూలు ఆస్తిపై అన్ని అనుభవ హక్కులతోపాటు పాక్షికంగా పూర్తయిన స్థితిలో ఉన్నది 100 చ॥అ॥ల కారు పార్కింగ్ మరియు 80 చదరపు అడుగుల ఉమ్మడి ప్రదేశంతో 850 చదరపు అడుగుల ప్లింత్ ఏరియా కొలతతో ఎస్.ఎస్. రెసిడెన్సీలోని మొదటి అంతస్తులో ఫ్లాట్ నం.204. హద్దులు: తూర్పు: ఓపెన్ టు స్కై, పడమర: ఉమ్మడి కారిడార్, ఉత్తరం: ఓపెన్ టు స్కై, దక్షిణం: ఫ్లాట్ నం.202.		

తేదీ : 09.11.2024, ప్రదేశము : కృష్ణా — సం/- అధీకృత అధికారి, హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

10న మెగా డీఎస్సీ ఉచిత శిక్షణ స్క్రీనింగ్ టెస్ట్

జ్ఞానభూమి పోర్టల్‌లో అందుబాటులో హాల్‌టికెట్లు

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : మెగా డీఎస్సీ కోసం రాష్ట్ర ప్రభుత్వం అందించే ఉచిత శిక్షణకు ఆన్‌లైన్ స్క్రీనింగ్ పరీక్ష ఈ నెల 10న జరగనుందని జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారత అధికారి కె.శ్రీనివాసరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 749 మంది ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు హాల్‌టికెట్లు జ్ఞానభూమి పోర్టల్‌లో అందుబాటులో ఉన్నట్లు అభ్యర్థులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. ఉదయం 9.30 గంటలకల్లా పరీక్షా కేంద్రానికి రావాలని, హాల్ టికెట్, ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్సు, పాన్ కార్డు వంటి ఏదైనా గుర్తింపు కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకురావాలన్నారు. నగరంలోని కేబీఎన్ డిగ్రీ కళాశాల, ఎనికేపాడు ఎస్ఆర్‌కే ఇంజనీరింగ్ కళాశాల, నున్న వికాస్ ఇంజనీరింగ్ కాలేజీ, మైలవరం లక్కిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల కేంద్రాల్లో పరీక్ష జరగనుందని తెలిపారు. ఇతర సమాచారానికి జిల్లా సాంఘిక సంక్షేమ కార్యాలయ హెల్ప్‌లైన్ నంబర్లు 7989027826, 7075624856) లో సంప్రదించాలని సూచించారు.

ఉచిత శిక్షణకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలి

డీఎస్సీ-ఎస్జీటీ పరీక్షకు బీసీ స్టడీ సర్కిల్ ద్వారా అందించే ఉచిత శిక్షణకు అర్హులైన అభ్యర్థులు ఈ నెల 12వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఏపీ బీసీ స్టడీ సర్కిల్ జిల్లా డైరెక్టర్ కె.శ్రీనివాసరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ అభ్యర్థులు తమ దరఖాస్తుతో బయోడేట, కుల, ఆదాయ ధ్రువీకరణపత్రాలు, టీసీ, పదో తరగతి, ఇంటర్, డిగ్రీ మార్కుల జాబితాలు, టెట్ మార్కుల జిరాక్స్ కాపీలను జతపర్చాలని తెలిపారు. తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.లక్షకు మించకూడదని, మెరిట్ ప్రాతిపదికన అభ్యర్థులను ఎంపికచేసి 60 రోజుల పాటు ఉచిత శిక్షణతో పాటు స్టైఫండ్, స్టడీ మెటీరియల్ ఇవ్వనున్నట్లు తెలిపారు.

ఓటరు జాబితాలో చేర్పులు మార్పులు: తహసీల్దార్

విశాలాంధ్ర-కంచికచర్ల: ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులు, సవరణలు వంటి ప్రక్రియ నిర్వ హించేందుకు స్పెషల్ సమ్మరీ రివిజన్ 2025 ప్రక్రియలో భాగంగా స్పెషల్ క్యాంపెయిన్ ఈనెల 9, 10 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు కంచికచర్ల తహసిల్దార్ పి. జాహ్నవి తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ప్రతి బూత్ స్థాయి అధికారి తన యొక్క పోలింగ్ కేంద్రం వద్ద ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు వారి యొక్క పోలింగ్ కేంద్రాల వద్ద హాజరై, సంబంధిత ఫారం 6,7,8 క్లెయిమ్స్ ను తీసుకోవాల్సి ఉంటుందన్నారు.స్పెషల్ సమ్మరీ రివిజన్ 2025 ప్రక్రియలో భాగంగా చీఫ్ ఎలక్ట్రోల అధికారి,ఆంధ్రప్రదేశ్ వారి సూచనల ప్రకారం ప్రతి బూతు స్థాయి అధికారి వారి యొక్కపోలింగ్ కేంద్రం వద్ద హాజరై కొత్తగా ఓటర్ గా చేరవలసిన వారి వివరాలతో పాటు ఓటర్ లిస్ట్ లో మార్పులు, చేర్పులు, తొలగింపులు సంబంధించి క్లెయిమ్స్ ఫారం 6,7,8 ను తీసుకోవాల్సి ఉందన్నారు.బి ఎల్ వో లు కేటగిరి వారీగా ఫారం 6,7,8 వివరాలు ఎన్ని వచ్చినవి అనే వివరాలు కంచికచర్ల తహసిల్దార్ కార్యాలయంలో తెలియ జేయాలన్నారు.బూతు స్థాయి అధి కారులు వారితో పాటు డ్రాఫ్ట్ రోల్ దగ్గర ఉంచుకోవాలన్నారు.కావున మండల ప్రజలు శని ఆదివారాలలో పోలింగ్ కేంద్రాలలో తమ పేరును పరిశీలించుకోవడంతో పాటు, ఓటర్ లిస్టులో చేర్పులు మార్పులు, సవర ణలు చేసుకోవచ్చని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తాసిల్దార్ జాహ్నవి కోరారు.

ప్రభుత్వం రబీ పంటకు అనుమతి ఇవ్వాలి

విశాలాంధ్ర - బంటుమిల్లి : రెండవ పరి (దాళ్వా) పంటకు ప్రభుత్వం అనుమతులిచ్చి సముద్ర తీర ప్రాంత రైతులను ఆదుకోవాలని బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లోని రైతులు స్థానిక బి అర్ అంబేద్కర్ సెంటరులో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు గౌరిసెట్టి నాగేశ్వరరావు మాట్లడుతూ ఈ సంవత్సరం రబీ పంటకు బంటు మిల్లి మెయిన్ కాలువ పరిధిలో దాళ్వావరి సాగుకు రాష్ట్ర ప్రభుత్వం అను మతి ఇవ్వాలని డిమెండ్ చేశారు. ఈ ప్రాంతం సముద్ర తీరం అవటం వలన, గత 4 సంవత్సరాల నుండి దాళ్వా వరిసాగుకు అనుమతి ఇవ్వక పోవడం వల్ల ఉప్పు శాతం పెరిగి వరి పొలాలు దెబ్బతిని, గణనీయంగా దిగుబడులు తగ్గి, భారీ వర్షాల ప్రభావం తోను రైతాంగం ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. అందువల్ల రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నత అధికారులు రైతాంగం ఆర్థిక ఇబ్బందులు గమనించి బంటుమిల్లి మెయిన్ కాలువ పరిధిలో దాల్వావరి సాగుకు అనుమతి ఇవ్వాలని గౌరిసెట్టి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. అనంతరం స్థానిక అంబేద్కర్ సెంటర్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి తహశీల్దార్ భరత్ రెడ్డి కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రైతులు అందరూ ముక్తకంఠంతో ఈ ప్రాంతానికి దాళ్వా వరిసాగుకు ప్రభుత్వం వెంటనే అనుమతి ఇవ్వాలని, ప్రకటన విడుదల చేయాలని కోరారు.

సంక్షేమానికి అడ్డంకిగా ఆధార్

విశాలాంధ్ర-విస్సన్నపేట : రాష్ట్రప్రభుత్వం పేద కుటుంబాలకు అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలకు ఆధార్ అడ్డంకిగా మారుతోంది. ఇటీవల ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం అమలు నుంచి త్వరలో అమలు చేయనున్న తల్లికి వందనం, కొత్త రేషన్ కార్డులు, పింఛన్లకు అర్హత ఉన్నా, పెద్దసంఖ్యలో లబ్ధిదారులకు అందని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే విద్యార్థులు, వారి తల్లి దండ్రులు ఆధార్‌లో తప్పులు సరిదిద్దుకునేందుకు అగచాట్లు ఎదుర్కొంటుండగా, ఇంకా పెద్దమొత్తంలో పేదలు సంక్షేమానికి దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కోసం అధికారుల చుట్టూ తిరగక తప్పనిసరి పరిస్థితి ఎదురుకానుంది. జిల్లావ్యాప్తంగా పలువురి ఆధార్ కార్డుల్లో తప్పులు దొర్లటంతోపాటు, వారి ఆధార్‌కు ఫోన్ నెంబరు లింకు కాకపోవటం, మరికొందరి కార్డులు అప్‌డేట్ కాకపోవటం వంటి సమస్యలు నెలకొన్నాయి. విద్యాశాఖ ఇటీవల అపార్ కార్డుల రూపకల్పన కోసం రూపొందించిన సాఫ్ట్‌వేర్‌లో ఆధార్ కార్డు సమస్య కారణంగా పెద్దసంఖ్యలో విద్యార్థుల వివరాలు నమోదు కాలేదు. ప్రభుత్వం తాజాగా పింఛనుకు దరఖాస్తు చేసుకోమని సూచించినా, ఇదే సమస్య పేదలు ఎదుర్కొనవలసిన దుస్థితి తలెత్తే అవకాశం ఉంది. ప్రభుత్వం ఈ సమస్య తగ్గించే దిశగా పలుచోట్ల ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేసినా, ప్రజలు ఈ శిబిరాల చుట్టూ తిరగటమే కానీ, వారి కార్డుల్లో తప్పులు సరిదిద్దే అవకాశం కనిపించటంలేదు. ఇటీవల విస్సన్నపేట మండలంలో మండలపరిషత్తు అధికారులు ప్రత్యేక ఆధార్ శిబిరం నిర్వహించగా, వేలల్లో ప్రజలు తమ కార్డుల్లో తప్పులు సరిదిద్దుకునేందుకు హాజరైనా, పదుల సంఖ్యలో మాత్రమే సమస్య పరిష్కారమయ్యింది. ఆధార్ సమస్య పరిష్కారం కోసం ఇప్పటికే వందల్లో ప్రజలు వివిధ మండలాల్లోని పలు ప్రాంతాలకు వెళ్లి, నిరాశగా వెనుదిరిగి వస్తున్నారు. ఈ విషయమై విస్సన్నపేట ఎంపీడీఓ సిహెచ్.చిన్నరాట్నాలును విచారించగా, ఆధార్ కార్డుల్లో తప్పులు సరిదిద్దటంలో జాప్యం నెలకొన్న మాట వాస్తవమేనన్నారు. ఈ పని నిర్వర్తిస్తున్న సచివాలయ ఉద్యోగులు సర్వర్ల సమస్య కారణంగా తాము ఏం చేయలేమంటున్నారని ఆయన పేర్కొన్నారు. గ్రామ సచివాలయ ఉద్యోగుల జిల్లా పర్యవేక్షణ అధికారి సురేష్‌ను విచారించగా, ఇప్పటివరకు ఆధార్ నమోదు, తప్పులు సరిదిద్దటంలో జాప్యం నెలకొన్నా, త్వరలోనే సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. వేగవంతంగా ఈ పని పూర్తి చేసేందుకు సంబంధిత సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేసి, తాజాగా అందుబాటులోకి తెచ్చి, పరిశీలన చేస్తున్నట్లు ఆయన వివరించారు.

టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలంలో శుక్రవారం నిర్వహి ంచిన పలు కార్యక్రమాలలో శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పాల్గొని బిజీ బిజీగా గడిపారు. పెదపూడి శివాలయం వద్ద సుమారు నాలుగువేల మందికి నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అదే సమయంలో షిరిడి సాయిబాబా, శివాలయంలో జరిపిన ప్రత్యేక పూజలలో నాయకులతో కలిసి పాల్గొని ఆశీస్సులు పొందారు. అనంతరం మొవ్వ మాజీ సర్పంచ్, మండవ బాలా త్రిపుర సుందరి ఇంటి వద్ద ఏర్పాటు చేసిన మండల టీడీపీ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అలాగే రిజిస్టర్ ఆఫీస్‌లో సమీపంలో కోసూరు నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జయలక్ష్మి క్యాటరర్స్‌ను ప్రారంభి చారు. అనంతరం కోసూరు గ్రామంలో జరిగిన అయ్యప్పస్వామి ఇరుముడుల కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమాలలో మండల అధ్యక్ష కార్యదర్శులు లింగమనేని రామలింగేశ్వరరావు, వీరంకి తులసీదాస్, నాయకులు తాతినేని పూర్ణచంద్రరావు శీలం బాబు రావు, మండవ కోటేశ్వరరావు, గుమ్మడి ప్రసాద్, మండవ వెంకటేశ్వరరావు, వేములవాడ సీతారామయ్య (సర్పంచ్, వేములవాడ) మేకా చంటి దంపతులు, దేవినేని రమేష్, తుమ్మల రాజబాబు, పెదపూడి, మొవ్వ, కోసూరు నాయకులు ఆయా ప్రాంతాలలోఅధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కేసరపల్లి లేఅవుట్ సందర్శించిన కలెక్టర్

విశాలాంధ్ర-గన్నవరం : జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ శుక్రవారం గన్నవరం మండలం కేసరపల్లి హౌసింగ్ లేఅవుట్ సందర్శించి గృహ నిర్మాణదారుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాలనీలో రహదారుల అభివృద్ధి, తాగునీటి సౌకర్యం, విద్యుత్ సౌకర్యం కల్పించాలని కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గృహ నిర్మాణ పథకం క్రింద గతంలో గృహం మంజూరైన ప్రతి ఒక్కరు ఇల్లు నిర్మించుకోవాలని సూచించారు. వచ్చే మార్చి లోగా ప్రతి ఒక్కరూ గృహం నిర్మించుకుని బిల్లులు పెట్టుకోవాలని, కాలనీలో మౌలిక సదుపాయాలు అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. గుడివాడ ఆర్డీవో బాలసుబ్రమణ్యం, గృహ నిర్మాణ శాఖ పిడి ఎస్ వెంకట్రావు, తాసిల్దారు పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ శుక్రవారం గన్నవరం మండలం కేసరపల్లి హౌసింగ్ లేఅవుట్ సందర్శించి గృహ నిర్మాణదారుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాలనీలో రహదారుల అభివృద్ధి, తాగునీటి సౌకర్యం, విద్యుత్ సౌకర్యం కల్పించాలని కలెక్టర్ ను కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గృహ నిర్మాణ పథకం క్రింద గతంలో గృహం మంజూరైన ప్రతి ఒక్కరు ఇల్లు నిర్మించుకోవాలని సూచించారు.వచ్చే మార్చి లోగా ప్రతి ఒక్కరూ గృహం నిర్మించుకుని బిల్లులు పెట్టుకోవాలని, కాలనీలో మౌలిక సదుపాయాలు అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.గుడివాడ ఆర్డీవో బాలసుబ్రమణ్యం, గృహ నిర్మాణ శాఖ పిడి ఎస్ వెంకట్రావు, తాసిల్దారు తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి మురుగు కాలువ అంచుకి ఆర్టీసీ బస్సు

విశాలాంధ్ర-పెదపారుపూడి : గుడివాడ నుండి విజయవాడ వెళ్తున్న ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు శుక్రవారం వానపాముల సమీపంలో అదుపు తప్పి మురుగు కాలువ అంచుకు వెళ్ళిపోయింది. గత కొన్ని సంవత్సరాలుగా ఆర్ అండ్ బి రోడ్డు గుంటలపడి శిథిలం అవటంతో తరచూ ప్రమాదాలకు దారితీస్తుందని బాట సారులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఆర్టీసీ బస్సులో 18 మంది ప్రయాణికులు ఉన్నారని ఏ ఒక్కరికి ఎటువంటి ప్రమాదం జరగలేదని ఆర్టీసీ గుడివాడ డిపో అసిస్టెంట్ మేనేజర్ జి సత్యనారాయణ తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న ఆయన బస్సు అదుపు తప్పిన తీరును, స్థితిని పరిశీలించారు.

రావెళ్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం

విశాలాంధ్ర - చల్లపల్లి : మండల పరిధిలోని మాజేరు శివారు పాత మాజేరు గ్రామానికి చెందిన చలమలశెట్టి సూరిబాబు క్యాన్సర్ వ్యాధితో మరణించగా ఆయన కుటుంబ సభ్యులకు రావెళ్ల ఫౌండేషన్ ఛైర్మన్ రావెళ్ళ ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలోరూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్ష కార్యదర్శులు నిడమానూరి దిలీప్ కుమార్, రావెళ్ల విజయ్ కుమార్, పాల్గొన్నారు.

మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్‌కు బకాయి వేతనాలపై చర్చ

ఏఐటీయూసీ అశ్వినికుమారి

విశాలాంధ్ర బ్యూరో - మచిలీపట్నం : విజయవాడ డిప్యూటీ లేబర్ కమిషనర్ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం కృష్ణాజిల్లా మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ సంస్థ తరుపున కమిషనర్ సీహెచ్ అశ్విని కుమారి వద్ద జాయింట్ మీటింగ్ జరిగింది. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్ తరుపున కృష్ణ ప్రసాద్ మాజరైనారు. గతంలో కమిషనర్‌కు కాంట్రాక్ట్ కార్మికులు గత 40 నెలలుగా ఈఎస్, ఐపిఎఫ్ చెల్లించలేదని విజ్ఞాపన పత్రం ఇచ్చారు. ఈ విషయాన్ని కమిషనర్ కాంట్రాక్టర్‌ను ప్రశ్నించగా తనకు 20వ తేదీ వరకు గడువు కోరాడు. తాను 20వ తేదీ లోపు కార్మికుల ఎకౌంట్లలో వారికి రావలసిన ఎమౌంట్ జమ చేస్తానని హామీ ఇచ్చారు. ఈ జాయింట్ మీటింగ్‌లో యూనియన్ అధ్యక్షులు ఓఎల్ రావు, గౌరవ అధ్యక్షులు జయలక్ష్మి, కమల, దుర్గప్రసాద్, ఎం. ఫణీంద్ర, పి. సుధీర్ కుమార్, కె. జోసప్, పి. సుదీర్ కుమార్, కె. జోసె, మెడికల్ కాలేజి నుండి లావణ్య, పద్మ, మాలతి, అవనిగడ్డ నుండి రజని, శాంతి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ న్యాయ సేవా దినోత్సవ ర్యాలీ

జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక

విశాలాంధ్ర బ్యూరో - మచిలీపట్నం: జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక జెండా ఊపి ఈ ర్యాలీని ప్రారంభించారు. జాతీయ న్యాయ సేవా దినోత్సవం నవంబరు 9వ తేదీ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కోర్టు ప్రాంగణం నుండి జిల్లాకోర్టు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు న్యాయ సేవా హక్కుల పట్ల అవగాహన కల్పించారు. కోర్టు సిబ్బంది జిల్లా కోర్టు సెంటర్ నందు మానవ హారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు న్యాయ మూర్తులు, పారా లీగల్ వాలంటీర్లు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆశలతను అభినందనలు

విశాలాంధ్ర-మచిలీపట్నం : నూతనంగా మెడికల్ కళాశాల సూపరింటెంట్‌గా కే ఆశలత పదవి చేపట్టిన సందర్భంగా శుక్రవారం ఆమె ఛాంబర్ లో ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు బెల్లంకొండ కోటేశ్వరరావు, బ్రాంచ్ కార్యదర్శి కాటూరి రత్నాకర్ పుష్ప గుచ్ఛం ఇచ్చి అభినందించారు. కార్మికులకు ఉన్న సమస్యల పై ఆమె దృష్టికి తీసుకెళ్ళగా దానికి ఆమె స్పందిస్తూ కార్మికుల సమస్యలను జాయింట్ మీటింగ్ వేసి పరిష్కరి స్తానని అలాగే కార్మికులకు రావాల్సిన ఏరియర్స్ కూడా అందేలా తగిన చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

భవానీ దీపాన్ని సందర్శించిన బీటీసీ ఇన్‌చార్జి సీఈఓ స్వామినాయుడు

విశాలాంధ్ర-విజయవాడ: విజయవాడలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన భవానీ ద్వీపాన్ని భవాని ద్వీప పర్యాటకాభివృద్ధి సంస్థ (బీటీసీ) ఇంచార్జి ముఖ్య కార్యనిర్వహణా ధికారి (సీఈఓ)శుక్రవారం బాధ్యతలు చేపట్టిన వి. స్వామి నాయుడు సందర్శి ంచారు. భవాని ద్వీపాన్ని ఇటీవల కొత్తగా బీటీసీ ఇంచార్జి సీఈఓగా బాధ్యతలు చేపట్టారు. ఇటీవలి వరదల వల్ల సంభవించిన నష్టాన్ని సమీక్షించి, పునరుద్ధరణ కార్యక్రమాల పురోగతిని గురించి అధికారు లను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం కార్తీక మాసం కావడంతో సోమవారం నుండి అడ్వెంచరస్ గేమ్స్ (సాహస క్రీడలు)ని పర్యాటకులకు అందుబాటులో ఉంచా లని, పర్యాటకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకో వాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరిం చాలని, ఆర్వో వాటర్, మేజ్ గార్డెన్, మిర్రర్ మాజ్ పునరుద్ధరించాలని ఆదేశించారు. సౌండ్ సిస్టం పని చేయాలనీ, దారి మార్గాల్లో పేరుకు పోయిన ఇసుక వారంలో తొలగించాలని ఆదేశించారు. ఈ పర్యవేక్షణలో బీటీసీ జనరల్ మేనేజర్ రమణి, మేనేజర్ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతన చట్టం అమలు చేయాలి

- ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి మూలి సాంబశివరావు

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కనీసం వేతనం రూ.26 వేలు అమలు చేయాలని ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి మూలి సాంబశివరావు డిమాండ్ చేశారు. స్థానిక రాజీవ్ గాంధీ పార్కులో శుక్రవారం జరిగిన పార్కు కార్మికుల కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, బుడమేరు వరద ముంపు సమయంలో కార్మికుల చేసిన కృషికి ఫలితంగా ఒక నెల జీతం బోనస్‌గా ప్రకటించాలన్నారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి బుద్దె రాజా మాట్లా డుతూ రూ.1500 ఉన్న జీతాన్ని దఫ దఫాలుగా ఏఐటీ యూసీ ఆధ్వర్యంలో పోరాడిన ఫలితంగా ప్రస్తుతం రూ.21 వేల జీతాన్ని పొందుతున్నారని గుర్తు చేశారు. పోరా టాల ఫలితంగానే డిమాండ్‌లను సాధించుకోగలమని ప్రతి కార్మి కులు గుర్తుంచుకోవాలన్నారు. కార్మిక చట్టాలు అమలు, న్యాయస్థానాల ఆదేశాలు అమలులో పాలకులు నిర్లక్ష్యం వహిస్తే కలిసి కట్టుగా పోరాడేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు జక్కి జేమ్స్, కోశాధికారి తుపాకుల నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శి తుపాకుల ప్రతాప్, విజయ్ పాల్గొన్నారు.

పీఆర్సీ కమిటీ ఏర్పాటు చేయాలి

- నివేదిక ఇచ్చే వరకు 35 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలి

- ఏఐఎస్‌టీఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి జోసెఫ్ సుధీర్‌బాబు

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : పీఆర్సీ కమిటీని వెంటనే ఏర్పాటు చేసి కమిటీ నివేదిక వచ్చేవరకు 35 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని ఏఐఎస్‌టీఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసెఫ్ సుధీర్ బాబు కోరారు. గుంటూరు ప్రాంతీయ కార్యవర్గ సమావేశం ఎస్టీయూ ప్రాంతీయ కార్యదర్శి శ్యామ్‌బాబు అధ్యక్షతన గుంటూరు ఎస్టీయూ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. ఈ సమావేశానికి ఏఐఎస్‌టీఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి జోసెఫ్ సుధీర్ బాబు, ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు డి.పెద బాబు, ప్రధాన కార్యదర్శి డీకే సుబ్బా రెడ్డిలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సుధీర్ బాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం, పక్క రాష్ట్రాలు సైతం డీఏలు ప్రకటించి నప్పటికీ ఇప్పటిదాకా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డీఏల ఊసుఎత్తలేదని అన్నారు. పెరుగుతున్న జీవన ప్రమాణాల మేరకు నిత్యావసర ధరల పెరుగుదల మేరకు కరువు భత్యాన్ని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ఉద్యోగ ఉపాధ్యా యులకు సుమారు రూ. 26 వేల కోట్ల డీఏ, పీఆర్సీ, పెండింగ్ బకాయిలను క్లియర్ చేరాలని కోరారు. పెద బాబు మాట్లాడుతూ యాప్‌ల భారం లేకుండా చేస్తామని చెప్పిన ప్రభుత్వం తగ్గించకపోగా అపార్ ఐడీలు అంటూ ఇతరత్రా పనులతో ఉపాధ్యా యులను బోధనకు దూరం చేసి మానసిక ఒత్తిడి కలుగజేస్తుందన్నారు. యాప్‌ల భారం లేకుండా చేయాలని అపార్ ఐడీల జనరేషన్‌లో వచ్చే సాంకేతిక సమస్యలను పరిష్కరించి, ప్రతి గ్రామంలో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. సుబ్బా రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు ఇచ్చిన సీపీఎస్ రద్దును వెంటనే అమలు చేసి రాష్ట్రంలోని ఉద్యోగు లందరికీ ఒకే పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని, పదవీ విరమణ అనంతరం ఉద్యోగులకు ప్రభుత్వం భరోసా కల్పించాలని కోరారు. జీఓ 117ను రద్దు చేస్తామని చెప్పిన ఎన్నికల హామీ మేరకు వెంటనే ఆ జీఓను రద్దు చేసి ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయాలని కోరారు. 2022 ఏప్రిల్ నుంచి పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్ ఎన్‌క్యాష్మెంట్, 2024 మార్చ్ నుంచి పెండింగ్‌లో ఉన్న పీఎఫ్, ఏపీజీఎల్ఐ లోన్లు, క్లోజర్స్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాశిమళ్ల ప్రసాద్, స్టేట్ కౌన్సిలర్స్ డీఏ జోసెఫ్, ఎస్‌కే బాజీ, ఎంపీ సుబ్బారావు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయం చూపిస్తాం

కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గుంటూరు కాకుమాను వారి తోటలో ఉన్న కార్మికశాఖ (వెల్ఫేర్ సెంటర్)స్థలం అభివృద్ధిలో భాగంగా అక్కడ నివసిస్తున్న యానాదులకు ప్రత్యామ్నాయం చూపించాలని ప్రజా సంఘాల నాయకులు కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌ను కోరారు. బృందావన్ గార్డెన్స్‌లో ఉన్న ఆయన కార్యాలయంలో ప్రజా సంఘాల నాయ కులు కలిసి వినతిపత్రం అందజేశారు. గత కొన్నేళ్లుగా యానాదులు అక్కడ నివాస గృహాలు ఏర్పాటు చేసుకుని నివాసముంటున్నారు. అయితే ఆ వెల్ఫేర్ సెంటర్ అభివృద్ధిలో భాగంగా వారిని ఖాళీ చేయమని మున్సిపాలిటీ వారు నోటీసులు అందజేశారు. అయితే వారికి ప్రత్యామ్నాయం చూపించిన తరువాతే ఖాళీ చేయించాలని మంత్రిని కోరారు. పెమ్మసానిని కలిసిన వారిలో బహుజన మహాసభ కేంద్ర కమిటీ కార్యదర్శి జీఆర్ భగత్‌సింగ్, రజక జనసేవ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు, ఆర్‌పీఐ రాష్ట్ర నాయకులు విప్పర్ల ముత్తయ్య, టి.నరసింహారావు, యానాది కాలనీ వాసులు ఉన్నారు.

సర్వజన ఆసుపత్రిలో మెడికల్ స్టోర్ ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో- మచిలీపట్నం : మచిలీపట్నం సర్వజన ఆసుపత్రిలో శుక్రవారం నూతనంగా ఏర్పాటు చేసిన అంగర తులసీదాస్ యెక్క లక్ష్మీ మెడికల్ జనరల్ స్టోర్స్‌ను ఏపీఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు ప్రారం భించారు. నాణ్యత పరమైన మెడిసిన్ ఉపయోగించాల్సి నదిగా యాజమా న్యంకు సూచించారు. మచిలీపట్నం నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్చార్జ్ బండి రామకృష్ణ, రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షులు హసీం బేగ్ తదితరులు పాల్గొన్నారు.

అపార్ పై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

విశాలాంధ్ర-సత్తెనపల్లి: అపార్ పై ప్రతి ఒక్క కాలేజి ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఇంటర్ మీడియట్ బోర్డు పల్నాడు జిల్లా అధికారి నీలావతి దేవి అన్నారు. శుక్రవారం పట్టణంలోని వేద, ఇతర కళాశాలల్లో ఆమె ఆకస్మికంగా అపార్ నమోదుపై తనిఖీ చేశారు. ఇంటర్‌లో చేరిన ప్రతిఒక్క విద్యార్థి వివరాలు అపార్ లో నమోదు చేయాలన్నారు. నమోదు విషయంలో ఇబ్బందులు ఎదురైతే సంబంధిత మండల విద్యాశాఖ అధికారులను సంప్రదించాలన్నారు. కళాశాలలో ఇప్పటి వరకు జరిగిన నమోదుపై సంతృప్తి వ్యక్తం చేసారు. విద్యార్థులకు ఆధార్ సంబంధిత సమస్యలు వస్తున్నాయని వీటిని పరిష్కరించేందుకు త్వరలో సత్తెనపల్లి కళాశాలలో ఆధార్ కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు ఆమె తెలిపారు. ఇంటర్ బోర్డు అధికారి సతీష్, కళాశాల ప్రిన్సిపాల్ అరుణ కుమారి, ఆఫీస్ సిబ్బంది జ్యోతి, దీప్తి,హర్ష వర్ధిని తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి విద్యా విహార్‌కు అక్రిడిటేషన్ సర్టిఫికెట్

విశాలాంధ్ర-మాచర్ల: స్థానిక సత్యసాయి విద్యా విహార్ పాఠశాలకు సత్యసాయి నేషనల్ కౌన్సిల్ ఫర్ స్కూల్స్ నుండి ఏ గ్రేడ్‌తో అక్రిడిటేషన్ సర్టిఫికెట్ మంజూరైనట్లు సత్యసాయి ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రెసిడెంట్ అక్కినేని అనిల్, సత్యసాయి సేవా సమితి కన్వీనర్ జక్కా శ్రీనివాస రావు, పాఠశాల హెచ్ఎం వై రమాదేవి తెలిపారు. వారు మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడం, పాఠశాల పరిశుభ్రత, విద్య తోపాటు విద్యార్థులకు మన ఆచార సాంప్రదాయాల గురించి వివరించడం, వేదం భరతనాట్యం లాంటివి నేర్పించడం పరిశీలించి పాఠశాలకు అక్రిడిటేషన్ సర్టిఫికెట్ ను మంజూరు చేసినట్లు వారు తెలిపారు.

భూమి, భుక్తి ముక్తి కోసం పోరాడిన అమరుల త్యాగం మనకు స్ఫూర్తిదాయకం

విశాలాంధ్ర-విజయవాడ: భూమి, భుక్తి, ముక్తి కోసం పోరాడిన అమరుల త్యాగాలు నేటితరానికి స్ఫూర్తిదాయకమని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి ఎం.రామకృష్ణ అన్నారు. నవంబర్ 1 నుండి 9 వరకు అమరవీరుల సంస్మరణ సభలు నిర్వహించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా శుక్రవారం విజయవాడ ప్రజాశక్తి నగర్ చంద్ర రాజేశ్వరరావు గ్రంథాలయంలో సభ జరిగింది. ముందుగా అమరవీరుల చిత్రపటాలకు పూలమా లలు వేసి నివాళు లర్పించారు. అనంతరం సభ రెండు నిమిషాలు మౌనం పాటించి జోహార్లు అర్పిం చారు. ఈ సభలో రామకృష్ణ మాట్లాడుతూ గోదా వరి లోయ ప్రతిఘటన పోరాటం మొదలుకొని నక్సల్బరీ, శ్రీకాకుళ గిరిజన రైతాంగ సాయుధ పోరాటాలలో నాటి నుంచి నేటి వరకు ఎంతోమంది వీరులు రాజ్య హింసలో మరియు అనారోగ్యంతో, అమరులయ్యారని వారందరికీ పేరు పేరునా విప్లవ జోహార్లు అర్పించారు. ప్రతిఘటన పోరాటాలతో అనేకమంది ప్రజలు భూ పోరాటాల ద్వారా లక్ష్య ఎకరాలు సాగు చేసుకుంటూ వారి హక్కుల్ని సంపాదించుకున్నారని చెప్పారు. నాటి నుండి నేటి వరకు పాలకులు మారినా ప్రజల పట్ల వాటి విధానాలు మారడం లేదన్నారు. ప్రధాని మోదీ చేస్తున్న ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలతో పాటు ఫాసిస్టు విధానాలు కారణంగా ఏ తప్పు చేయని ప్రొఫెసర్ సాయి బాబాను పొట్టన పెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మనవడు ఆనంద్ తేల్ తుండే, విప్లవ రచయితా వరవరరావు లాంటి ప్రజా పౌర హక్కుల కోసం పనిచేసే గొంతులను నిర్బం ధాన్ని ప్రయోగిస్తూ జైల్లో పెడుతున్నారని చెప్పారు. డబల్ ఇంజన్ సర్కార్, బుల్డోజర్ పాలను వ్యతిరేకిస్తూ ప్రతిఘటన పోరాటాలను తీవ్రతారం చేస్తూ అమరుల ఆశయ సాధనకై పోరాడాలని వారు తెలిపారు. ఈ సభకు రవీంద్ర అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కనకరావు, టి. శ్రీను, నాని , ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు కెవి రమణ, ఉపాధ్యక్షుడు షేక్ మిరావలి, అరుణోదయ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీను, బిసి డబ్ల్యూయు జిల్లా కోశాధికారి సుబ్బారావు, రామచంద్ర రావు, జీకే, తదితరులు పాల్గొన్నారు.

స్వూర్య భగవానుడికి బీహారీలు ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-విజయవాడ (వన్ టౌన్): పజలందరూ, సుఖ సంతోషాలతో, సిరిసంపదలతో తుల తుగాలని,అందరిజీవితాల్లో వెలుగులు నిండాలని అకాంక్షిస్తూ స్వూర్య భగవానుడికి కృష్ణామ్మ నదీ తీరాన గల పున్నమి ఘాట్ లో బీహారీలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీకమాసం 6వ రోజున స్వూర్య భగవానుడికి పూజలు చేయటం అనవాయిగా వస్తుందని,ప్రజలందరికీ మంచి జరగాలని కోరుతూ ఈ పూజలు చేస్తామని తెలిపారు,పూజలు చేసేందుకు గుంటూరు, కృష్ణా, ఏలూరు, ఎన్టీఆర్ తదితర జిల్లాల నుండి బీహారీలు పాల్గోని ప్రత్యేక పూజలు చేశారు.కార్తీకమాసం 5,6రోజుల్లో ప్రతిఒక్కరు వారి వారి ఇళ్ళల్లో పూజలు చేసుకుంటారు,కార్తీక మాసం 7,8రోజుల్లో నదీలో ఈ పూజలు అత్యంత పవిత్రంగా నిర్వహిస్తారు,ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గోన్నారు. నిర్వాహకులు పంచానంద్ షా,ఉదయ్ షా, పంకజ్ చౌహాన్,గుప్తా జీ,భావేష్ పాఠక్, రాహుల్ కుమార్ పాల్గొన్నారు.

లెక్సలిగిస్.ఎఐ పరిచయం చేస్తోంది ఇంటరాక్ట్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): లీగల్ టెక్నాలజీ అండ్ లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ (ఎల్ఎల్ఎం)లో అగ్రగామిగా ఉన్న లెక్సలిగిస్. ఎఐ విప్లవాత్మక ఫీచర్ ఇంటరాక్ట్ను ప్రారంభించినట్లు సగర్వంగా ప్రకటించింది. డాక్యుమెంట్ వర్క్ ఫ్లోలను న్యాయ నిపుణులు నిర్వహించడం, విశ్లేషించడం మరియు ఆప్టిమైజ్ చేసే విధానాలలో కొత్త మార్పు తీసుకురావడానికి ఇది రూపొందించ బడింది. శక్తివంతమైన న్యాయ పరిశోధన సాధనంగా మరింత అభివృద్ధి చేస్తూ ఇంట రాక్ట్ ఒక కొత్త పరిణామాన్ని ఆవిష్కరిస్తోంది, ఇది లెక్సలిగిస్.ఏఐ సమగ్ర కేసు నిర్వహణ పరిష్కారంగా మారుస్తుంది. ఆధారిత ఫీచర్లను జోడించి, న్యాయ ప్రక్రియలను మరింత తెలివిగా, సమర్థవంతంగా చేస్తుంది.

స్కిల్ సెన్సెస్ పై పంచాయతీ సిబ్బందికి శిక్షణ

విశాలాంధ్ర-కూచిపూడి: మొవ్వ మండల ప్రజా పరిషత్ కార్యాల యంలో పంచాయతీ కార్యదర్శులకు సచివాలయ సిబ్బందికి "స్కిల్ సెన్సెస్" పై శుక్రవారం ఒక్కరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభా కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎంపీడీ వోజే విమాదేవి మాట్లాడుతూ సిబ్బంది గ్రామాలలో రీ సర్వే నిర్వహించే సమయంలో వచ్చే సమస్యల పరిష్కారానికి ఈ శిక్షణ ఎంతో ఉపయోగకర మని పేర్కొన్నారు. మండల గ్రామాభివృద్ధి, విస్తరణాధికారి మాదివాడ కృష్ణ పరమాత్మ పర్యవేక్షణలో ఈ శిక్షణను రిసోర్స్ పర్సన్స్‌గా నున్న పంచాయతీ గ్రేడ్-6 కార్యదర్శి కం డిజిటల్ అసిస్టెంట్లు సిరియాల అర్జునరావు (పెదపూడి), కొండేటి రాజేష్, (అయ్యంకి) మండల కోఆర్డినేటర్ రాహుల్ అందజేశారు. వారు నైపుణ్య యాప్‌కు సంబంధించిన సలహాలు సూచ నలు ఇచ్చి సిబ్బంది సందేహాలను వృద్ధి చేశారు.

గ్రామాలలో ప్రారంభమైన ఇంటింటి జియో టాకింగ్

విశాలాంధ్ర-కూచిపూడి: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు గ్రామాలలో ప్రతి ఇంటికి జియో టాకింగ్ కార్యక్రమాన్ని సచివాలయ ఉద్యోగులు ప్రారంభించారు. కుటుంబం లోని వివరాలు జియో కోఆర్డినేట్ చేసి సచివాలయ ఉద్యోగుల మొబైల్ యాప్‌లో నమోదు (అప్లోడ్) చేసే ప్రక్రియ మొవ్వ మండలంలో ప్రారంభమైంది. మండలంలోని 16 సచివాలయా లలో కేటాయించిన సిబ్బంది జియో టాకింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ప్రారంభంలో కొంతసేపు సర్వర్ పనిచేయకపోవడంతో సిబ్బంది ఇబ్బందిపడ్డారు. దీనిలో భాగంగానే కూచిపూడి సచివాలయంలో వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ పి ఉమామహేశ్వరరావు తన పరిధి లోని ప్రతి కుటుం బానికి చెందిన ఇంటి ఫోటో యాప్ లో అప్లోడ్ చేయడం ప్రారంభించారు. అలాగే ధ్రువీకరించేలా కుటుంబ సభ్యుల్లో ఒకరితో ప్రత్యేక డివైజ్ ద్వారా వేలిముద్రలు, కాని ఐరిష్‌ను కాని నమోదు చేసుకు ంటున్నారు. భవిష్యత్తులో ఏదైనా విపత్తులు సంభవించినప్పుడు కుటుంబ వివరాలు తెలుసుకునేందుకు, సంక్షేమ కార్యక్రమాలు సమర్థవంతంగా రూపొందించడానికి, అమలుపరచ డానికి ఈవిధానం ఉపయోగపడు తుందని అధికారుల సమాచారం.

బీసీ, బాలికల హాస్టల్ సందర్శించిన కృష్ణాజిల్లా న్యాయ సేవ అధికారి

విశాలాంధ్ర-పెదన : పెదన పట్టణం బ్రహ్మపురంలో ఉన్న ప్రభుత్వ బిసి బాలురు మరియు బాలికల ఆస్తులను సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్ వంట రూమ్ బాత్రూం పరిశీలిం చారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా న్యాయ సేవ అధికారి సమస్త కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి మచిలీపట్నం వారు కె.వి.రామ కృష్ణయ్య. వారి బృందం ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి జగ్గయ్యపేట కె శ్రీవాణి. మొబైల్ కోర్టు జడ్జి మచిలీపట్నం ఎం వెంకట వాహిని. జూనియర్ సివిల్ జడ్జి నూజివీడు వి వెంకటేశ్వ రమ్మ. జూనియర్ సివిల్ జడ్జి అవినిగడ్డ ఎల్ గోపీనాథ్. రషీద్ ఖాన్ న్యాయశాఖ సిబ్బంది. పెదన ఎస్సై జి సత్యనారాయణ. హాస్టల్ వెల్ఫేర్ అధికారి చిట్టూరి రవి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

గంగానమ్మ దేవస్థానం ప్రతేక పూజలు

విశాలాంధ్ర - గుడివాడ : గుడివాడ రూరల్ మండలం లోని మోటూరు గ్రామంలో శ్రీ గంగానమ్మ దేవస్థానం 15వ వార్షికోత్సవ సంబరాలలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు అమ్మవారిని దర్శించుకుని ప్రతేక పూజాలు నిర్వహించి, అన్నసమరాధన కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు వాసే మురళి, నాయకులు చీకటి శేషగిరిరావు, కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.

10 నుంచి జీ తెలుగు సింగింగ్ షో సరిగమప సీజన్ 16

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట : తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న మ్యూజికల్ రియాలిటీ షో సరిగమప సీజన్ 16 నవంబర్ 10 నుంచి ప్రతి ఆదివారం రాత్రి 8:30 గంటల నుంచి 10 గంటల వరకు జీ తెలుగులో ప్రసారం కానుందనీ సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎనర్జిటిక్ యాంకర్ శ్రీముఖి వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న ఈ సీజన్‌కి సంగీత దిగ్గజాలు కోటి, ఎస్పీ శైలజ, కాసర్ల శ్యామ్తో ఈ సీజన్ ఉత్తేజకరమైన ప్రదర్శనలు, మనసును హత్తుకునే పాటలతో సంగీత ప్రియులకు మరింత వినోదం పంచబోతోందన్నారు. ప్రతి కంటెస్టెంట్ తమ ఆకట్టుకునే ప్రదర్శన లతో తెలుగు ప్రేక్షకులకు ఫేవరెట్‌గా మారుతున్నారన్నారు. ఔత్సాహిక గాయకులు తదుపరి సింగింగ్ సెన్సేషన్ టైటిల్ కోసం పోటీ పడుతుండ టంతో థ్రిల్లింగ్ కాంపిటీషన్లు, మరచిపోలేని క్షణాలను అందిస్తూ ప్రతి వీకెండ్‌ను మరింత స్పెషల్ చేస్తోందన్నారు. ఆదివారం అంతులేని వినోదం అందించే ఉద్దేశంతో జీ తెలుగు సరిగమప సీజన్ 16 ప్రసార సమయాన్ని మరింత పెంచిందన్నారు. శ్రోతల మనసును తాకే సంగీతంతో పాటు చక్కని వినోదం అందించే లక్ష్యంతో వస్తున్న జీ తెలుగు సరిగమప సీజన్ 16 ప్రతి ఆదివారం రాత్రి 8:30 గంటలకు, తప్పక చూడలన్నారు.

టాటా ఇండియా ఇన్నోవేషన్ ఫండ్‌ను ఆవిష్కరించిన టాటా అసెట్ మేనేజ్మెంట్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): వివిధ రంగాలలో వినూత్న వ్యూహాలు మరియు థీమ్లను అమలు చేస్తూ ప్రయోజనం పొందే కంపెనీల్లో పెట్టుబడులు పెట్టడం ద్వారా పెట్టుబడిదారులకు దీర్ఘకాలిక మూలధన వృద్ధి అవకాశాలను అందించే లక్ష్యంతో టాటా ఇండియా ఇన్నోవేషన్ ఫండ్ను ప్రారంభిస్తున్నట్లు టాటా అసెట్ మేనేజ్మెంట్ ప్రకటించింది. ఈ ఎన్ఎఫ్ఓ (న్యూ ఫండ్ ఆఫర్) 2024 నవంబర్ 11న సబ్ స్క్రిప్షన్ కోసం ప్రారంభమవుతుంది.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

విశాలాంధ్ర-విజయవాడ: మొఘలరాజపురం సెక్షన్, లబ్బీపేట విద్యుత్ ఉప కేంద్రం 11 కేవీ లబ్బీపేట ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మత్తులు, నిర్వ హణ శనివారం ఉదయం 8 నుండి 10.30 గంటల వరకు వివిధ ప్రాం తాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని ఏపీసీపీడీసీఎల్, విజయవాడ టౌన్ కార్యనిర్వాహక ఇంజనీర్ పి. రవీంద్రబాబు శుక్రవారం ఒక ప్రకట నలో తెలిపారు. విద్యుత్ సరఫరా నిలిపివేయు ప్రాంతాలు: పిచ్చయ్య వీధి, మసీదు వీధి, దుర్గా రైస్ మిల్ ఏరియా, పైడయ్య వీధి, టెంపుల్ స్ట్రీట్, లబ్బీపేట, పశువుల హాస్పిటల్ రోడ్డు, బందర్ రోడ్డు తదితర ప్రాంతాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆయా ప్రాంత విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

తహసీల్దార్ కార్యాలయంను కలెక్టర్ తనిఖీ

విశాలాంధ్ర-గన్నవరం: జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ శుక్ర వారం ఉంగు టూరు తాసి ల్దార్ కార్యాలయం ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యాల యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం లో వచ్చిన అర్జీల పరిష్కారం వాటికి ఇచ్చిన ఎండార్స్మెంట్లు కలెక్టర్ పరిశీలించారు. భూ సమస్యలకు సంబంధించి ఇళ్ళ స్థలాల పంపిణీ సంబంధించిన ఫైళ్ళు, ఆర్ఓఆర్ రిజెక్షన్స్, మ్యుటేషన్స్ ఫైళ్ళు ర్యాండం తనిఖీ చేశారు. ప్రజల నుండి వచ్చిన అర్జీలు పరిష్కారం పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ సరైన ఎండార్స్మెంట్ ఇవ్వాలని ఆ విషయం అర్జీదారులకు తెలియజేయాలని తాసిల్దార్ జే. విమలకుమారికి సూచిం చారు. గుడివాడ ఆర్డిఓ బాలసుబ్రమణ్యం, పాల్గొన్నారు.

విద్యుత్ అధికారులు తనిఖీ

విశాలాంధ్ర-గుడివాడ : విద్యుత్‌ను అనాధికారింగా ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని విద్యుత్ శాఖ విజిలెన్స్ సూపరిండెంట్ ఇంజనీర్ అల్ఫన్స్, విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సిహెచ్‌వాసు, గుడివాడ ఎగ్జి క్యూటివ్ ఇంజనీర్ జి.బి శ్రీనివాసరావులు అన్నారు. శుక్రవారం స్థానిక ఏలూరు రోడ్డులోని విద్యుత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమా వేశంలో వారు మాట్లాడుతూ గుడివాడ టౌన్, సబ్ డివిజన్ పరిధిలోని నంది వాడ మండలంలో తనిఖీ నిర్వహించినట్లు తెలిపారు. ఈ తనిఖీలలో గృహ, వాణిజ్య, ఆక్వా సర్వీస్‌లను పరిశీలించడం జరిగిందన్నారు. తనిఖీలలో 287 ఆక్వా, 1513 గృహాలు, 114 వాణిజ్య సర్వీసులలో 160 సర్వీసులు అదన పు లోడు గుర్తించి 5,81,000/- జరిమానా విధించడం జరిగిందన్నారు.